

జల గలగలలు

వానలకు వాగులు వంకలు పొంగడమే కాదు.. కొండకోనల్లోంచి జలపాతాలు జాలువారుతున్నాయి. శ్రీకాళహస్తి ఖైరవకోనలో శివలింగాన్ని అభిషేకిస్తూ జలధార కిందికి జారుతున్న దృశ్యం అబ్బురపరుస్తోంది. తిరుమల కొండల్లోనూ అనేకచోట్ల జలధారలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి.



చదువులమ్మ వెళ్లిపోయింది

ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళాకాలేజీ రూపశిల్పి కంభంపాటి రాజేశ్వరీమూర్తి శుక్రవారం కన్నుమూశారు. తిరుపతిలోని పద్మావతీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా 22 ఏళ్లు సేవలందించిన ఆమె న్యూయార్క్‌లో తన 104వ పుట్టినరోజు జరుపుకొన్న మూడవ రోజునే కన్నుమూశారు.



అన్నదాతల జాడేది?

అధికారం కోల్పోయిన జగన్.. కూటమి ప్రభుత్వం ఆరునెలలకే విఫలమైందంటూ కత్తిగట్టి అన్నదాతకు అండగా అంటూ ఇచ్చిన పిలుపు తిరుపతిలో తుస్సుమంది. ఈ నిరసనలో అన్నదాతల జాడ కనిపించలేదు. వానకు ఇచ్చిన సెలవులో ఉన్న కాలేజీ విద్యార్థులను తరలించుకువచ్చారు.

- వివరాలు 8లో -

రెవెన్యూ సదస్సులకు 593 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం 43చోట్ల రెవెన్యూ సదస్సులు నిర్వహించగా, 593 అర్జీలు వచ్చాయని కలెక్టరు వెంకటేశ్వర్ తెలిపారు. భూకబ్జాలపై 2, ఇంటి స్థలాలకోసం 10, అసైన్‌మెంట్ ల్యాండ్‌కు సంబంధించి 57, రీసర్వేకు 22, గ్రామవార్డు సచివాలయాలపై 14, ఆర్‌వోఆర్‌కు 361, ఇతర విషయాలకు సంబంధించి 81 ఫిర్యాదులు అందినట్లు పేర్కొన్నారు. వీటిలో ఏడింటిని అప్పుడే పరిష్కరించామని తెలిపారు.

వాన నిలిచినా తగ్గని వెతలు

- నీట మునిగిన గ్రామాలు, ఇళ్లు
- నీటిపాలైన వందలాది ఎకరాల పంటలు



సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరు రోడ్డులో వరదనీరు



సూళ్లూరుపేట మండలం వట్రపాలెంలో వృద్ధురాలను తెప్పబెండుపై పునరావాస కేంద్రానికి తీసుకెళ్తున్న దృశ్యం



తడ మండలం చేనిగుంటలో నీటమునిగిన వరిపైరును చూపిస్తున్న రైతు



చేనిగుంటలో మునిగిన పంటపొలాలను పరిశీలించేందుకు ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్లూరుపేట మండలం పుచ్చాకాలువ ప్రవాహంతో కోటపోలూరు రోడ్డుపై నీటి ప్రవాహం

- తూర్పున పెరిగిన వాగుల ఉధృతి
- పలు మార్గాల్లో రెండో రోజూ ఆగిన రాకపోకలు

బంగాళాఖాతంలో తలెత్తిన వాయుగుండం కారణంగా జిల్లాలో గురువారం భారీ వర్షం పడింది. శుక్రవారం వాన తెరిపిచ్చినా జనం వెతలు మాత్రం తగ్గలేదు. ముఖ్యంగా తూర్పు ప్రాంతాల్లో వాగుల ఉధృతి మరింత పెరిగింది. పలు మార్గాల్లో రెండో రోజూ రాకపోకలు ఆగిపోయాయి. పలు గ్రామాలు, ఇళ్లు నీటమునిగాయి. బీఎన్ కండ్రిగలో పూరిగుడిసె కూలిపోగా వందలాది ఎకరాల్లో మిరప, వరి పంటలు నీటి పాలయ్యాయి. వడమాలపేట మండలంలో బోటులో వెళ్లి మరీ ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఏర్పేడు మండలం ముసలిపేడులో నీటితో దెబ్బతిన్న వేరుశనగ

సత్యవేడు, శ్రీకాళహస్తి ప్రాంతాల్లోనూ తగ్గని వరద ప్రభావం

కేవీబీపురం మండలంలో కళత్తూరు రిజర్వాయర్ నిండిపోయి కలుజు పొంగి పారుతోంది. పూడి గ్రామాలకు రాకపోకలు రెండవ రోజు కూడా నిలిచిపోయాయి. శ్రీకాళహస్తి మండలం ముచ్చువోలు వద్ద సున్నపు కాలువ ఉధృతి తగ్గలేదు. నిన్నటి నుంచీ రాకపోకలు ఆగిపోయాయి. ముళ్ళపూడి ఎస్టీ కాలనీ వద్ద కూడా వాగు పొంగి రాకపోకలు నిలిచాయి. వరదయ్యపాలెం మండలంలోని వాగుల్లో ఇంకా వరద ఉధృతి తగ్గలేదు. సీఎల్ఎన్ పల్లి వద్ద పాముల కాలువ, అంబూరు కామాక్షమ్మ ఆలయం వద్ద వాగు ఉధృతి వల్ల సంతవేలూరు, అంబూరు గ్రామాల వద్ద పొలాలన్నీ నీట మునిగాయి. పిచ్చాటూరు మండలంలో అరణియార్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండింది. బీఎన్ కండ్రిగలో 50 ఎకరాల మిరప పంట నీట మునిగింది. జంబుగోళం, పూసలపల్లి, చిన్నయ్యగుంట గ్రామాల్లో 300 ఎకరాల వరి పంట నీటిపాలైంది. చిన్నపాలేడు గ్రామంలో పోలయ్య అనే గిరిజనుడి పూరిగుడిసె కూలిపోయింది. బీఎన్ కండ్రిగ నుంచీ సూళ్ళూరుపేట మార్గంలో రాకపోకలు నిలిచాయి.



కోట మండలం గోవిందపల్లి- గోవిందపల్లిపాళెం గ్రామాల మధ్య వరద నీటి ప్రవాహం

పొంగిన వాగులు, కాలువలు

తడలో కాళంగి నది, పాముల కాలువలు పొంగడంతో కాదలూరు రోడ్డుపైకి నీరు చేరింది. కాదలూరు, వెండ్లూరుపాడు, కట్టువ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండలంలోని గ్రద్దగుంటలో పలు ఇళ్ళు నీట మునిగాయి. పులికాట్ సరస్సులో పోటు పెరగడంతో వందలాది ఎకరాలు నీట మునిగాయి. గూడూరు మండలంలో పంబలేరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో పట్టణంలోని పాత నెల్లూరు రోడ్డులో రాకపోకలు స్తంభించాయి. కోట మండలంలో స్వర్ణముఖి, చల్ల కాలువలకు వరద పోటు పెరిగింది. దొరవారిసత్రంలో కాళంగి ఉగ్రరూపం దాల్చింది. దీంతో పరివాహక ప్రాంతాలు జలమయమయ్యాయి. పెళ్లకూరు మండలంలో వరి పంట నీటమునిగింది. మండలంలోని కలవకూరు డ్యామ్‌పై నీటి ఉధృతికి రాకపోకలు ఆగిపోయాయి.

వచ్చిన నీరు వచ్చినట్లే..

వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీలోకి గురువారం పది వేల క్యూసెక్కుల వరద నీరు రాగా శుక్రవారం ఏకంగా 27 వేల క్యూసెక్కుల నీరు చేరింది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్టే కిందకు వదిలిపెట్టేస్తున్నారు. మొత్తం 34 గేట్లలో ఏడింటిని ఎత్తివేసి నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో బాలిరెడ్డిపాలెం, గంగనపాలెం నడుమ కాజ్‌వేపై ప్రవాహ ఉధృతి పెరిగిపోయింది. రెండో రోజైన శుక్రవారం కూడా 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వేకి ఇరువైపులా భారీగా గ్రావెల్ తరలించి కట్టలుగా ఏర్పాటు చేసిన రెవిన్యూ అధికారులు నీరు గ్రామాల్లోకి రాకుండా అడ్డుకున్నారు.

నాయుడుపేట, సూళ్లూరుపేటలో రోడ్లపైకి వరద నీరు

నాయుడుపేటలో స్వర్ణముఖిలోకి వరద నీరు భారీగా చేరుతోంది. దీంతో పట్టణంలో కాజ్‌వేపై కూడా నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఫలితంగా నాయుడుపేట నుంచీ మేనకూరు, వెంకటగిరి ప్రాంతాలకు రాకపోకలు స్థంభించాయి. కాజ్‌వేకి ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. కాజ్‌వే వద్ద పోలీసు, రెవిన్యూ బృందాలు మకాం వేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. సూళ్ళూరుపేట ఆర్టీసీ డిపో సమీపంలో జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. కాళంగి నదికి భారీగా వరద నీరు రావడంతో సూళ్ళూరుపేట నుంచీ మన్నారుపోలూరు వెళ్ళే రోడ్డుపైకి నీళ్లు వచ్చాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు ఆగిపోయాయి. మన్నారు పోలూరు గ్రామం కూడా దాదాపు జలదిగ్బంధంలో చిక్కుకుంది. పుత్తూరు మండలం నందిమంగళం చెరువు నిండి కలుజు పారుతోంది. వీరప్పరెడ్డి పాలెం చెరువు సైతం నిండిపోయింది. తాజా వర్షాలకు మండలంలో మూడు మినహా మిగిలిన చెరువులన్నీ నిండాయి. వడమాలపేట సమీపం చీమలవారి వంక కాజ్‌వే కుంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

బోటుపై వెళ్లి..

- విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన సిబ్బంది





ఈ వర్షాలకు వడమాలపేట మండలం ఎస్వీఆర్‌పురం వద్ద గూళూరు చెరువు నిండింది. ఈ చెరువులోని 11 కేవీ మెయిన్ లైన్ నీటి ప్రవాహంతో ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో దిగువ గూళూరు పరిసర గామాల్లో గురువారం నుంచే సరఫరా ఆగిపోయింది. పుత్తూరు విద్యుత్ ఏఈ జయసాయి ఆధ్వర్యంలో లైన్‌మ్యాన్ వేణు, జేఎల్ఎం అశోక్, సిబ్బందితో శుక్రవారం గూళూరు చెరువులో బోట్‌పై వెళ్లి 11 కేవీ స్తంభం వద్ద లైన్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది చేసిన కృషిని స్థానికులు కొనియాడారు.

- వడమాలపేట, ఆంధ్రజ్యోతి

రేణిగుంట ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ సస్పెన్షన్

రేణిగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఓ స్థలం రిజిస్ట్రేషన్ వ్యవహారంలో రేణిగుంట ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ రాజేష్ సస్పెండయ్యారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా ఇన్‌స్పెక్టర్ జనరల్ గిరిబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జిగా సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవకతవకలపై అందిన ఫిర్యాదుల మేరకు ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ఐజీ ఉదయ్‌భాస్కర్ మూడు రోజులపాటు సమగ్ర విచారణ జరిపిన విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన రిజిస్ట్రేషన్ల వివరాలతో ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. వాటి ఆధారంగా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ రాజేష్‌ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడ పనిచేసే అధికారులు ఒకరి తర్వాత మరొకరు తాము చేసిన తప్పులకు సస్పెండవుతుండటం చర్చనీయాంశంగా మారింది. కాగా, గతంలో ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసి సస్పెండైన ఓ అధికారి మళ్లీ పోస్టింగ్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ఘనంగా చొక్కాణి ఉత్సవం



వెలుగుతున్న చొక్కాణి

శ్రీకాళహస్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మహానంది వద్ద శుక్రవారం రాత్రి చొక్కాణి ఉత్సవం వేడుకగా జరిగింది. గురువారం రాత్రి కలశస్థాపనతో వేదపండితులు క్రతువును ప్రారంభించారు. కలశస్థాపన అనంతరం బాలాదీపాలను అమ్మవారి సన్నిధి వద్ద వెలిగించి స్వామి సన్నిధి వద్దభద్రపరిచారు. శుక్రవారం రాత్రి వరకు బాలాదీపాలను నిరంతరాయంగా వెలిగేలా ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం తాటిచెట్టును మహానంది వెనుకవైపున దారాలతో లాగి నిలబెట్టారు. దీని చుట్టూ తాటాకు మట్టలను కప్పారు. రాత్రి ఆలయం నుంచి బాలాదీపాలను ఊరేగింపుగా తాటిచెట్టు వరకు తీసుకొచ్చి ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం చొక్కాణిని వెలిగించారు. చొక్కాణి జ్యోతి అఖండ ప్రజ్వలనతో ప్రకాశించింది. ఇందులోని భస్మాన్ని ఈశ్వరప్రసాదంగా భావించి భక్తులు పోటీపడి ఇళ్లకు తీసుకెళ్లారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపుగా వస్తున్న స్వామి అమ్మవార్లు

నేడు తిరుపతిలో ఏపీఈఆర్‌సీ చైర్మన్ సమావేశం

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఏపీఈఆర్‌సీ చైర్మన్ టి.రామసింగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ సంస్థ ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమీక్షించనున్నట్లు వివరించారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలు

- 610 సంఘాలు.. 1,94,268 మంది ఓటర్లు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికలకు రంగం సిద్ధమైంది. జిల్లాలో 610 సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు బుధవారం కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆమేరకు శనివారం అన్ని కమిటీలకు ఎన్నిక నిర్వహించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. సంఘాల అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకోనున్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తకుండా వీలైనంత వరకు ఏకగ్రీవంగా ఎన్నికలను పూర్తిచేసేందుకు జలవనరుల శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలోని 33 మండలాల్లో మొత్తం 610 నీటి సంఘాలు ఉన్నాయి. వీటిలో మైనర్ ఇరిగేషన్‌కు చెందిన సంఘాలు 599 కాగా సంఘాలు ప్రాజెక్టులకు చెందినవి 11 ఉన్నాయి. ఇందులో అరణియార్ ప్రాజెక్ట్ కింద 5, స్వర్ణముఖి కింద 6 ఉన్నాయి. శనివారం ఉదయం ఎనిమిది నుంచి ఎన్నికలు జరగనున్నాయి. 18 ఏళ్లు నిండి, పట్టా భూమి తమ పేరున కలిగి ఉండటంతోపాటు నీటి తీరువాలో ఎలాంటి బకాయిలు లేనివారే ఓటర్లుగా ఉంటారు. అలా జిల్లాలో 1,94,263 మంది ఓటర్లు ఉండగా.. వీరిలో పురుషులు 1,32,156, మహిళలు 62,107 మంది. సుమారు తొమ్మిదేళ్ల తర్వాత నీటి సంఘాల ఎన్నికలు జరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: సాగునీటి సంఘాల ఎన్నికలు పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం వర్చువల్ విధానంలో ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. పక్షపాతం, అవకతవకలకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు.

నేడు అన్ని పాఠశాలలకు సెలవు

తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి: జిల్లాలోని అన్ని పాఠశాలలకు రెండో శనివారం సెలవు దినంగా డీఈవో కేవీఎన్ కుమార్ ప్రకటించారు. అలాగే, నీటి సంఘాల ఎన్నికలకు చాలా ప్రాంతాల్లో పాఠశాలల భవనాలే పోలింగ్ కేంద్రాలుగా ఉన్నందున సెలవు ప్రకటించినట్టు తెలుస్తోంది.

నడింపల్లెలో కోతకు గురైన కల్వర్టు



మరమ్మతులు చేయిస్తున్న నాయకులు

చంద్రగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నడింపల్లె వద్ద స్వర్ణముఖినదిలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు కోతకు గురైంది. ఇటీవల తుఫాన్, ఆగ్నేయ బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు స్వర్ణమునది ఉధృతంగా సాగుతుండటంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్వర్టు కోతకు గురైంది. కల్వర్టు పూర్తిగా కోతకు గురైతే నడింపల్లె గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో ఆ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దొమ్మలపాటి సతీష్ స్పందించి సొంత నిధులతో ట్రాక్టర్లతో మట్టి, రాళ్ల తోలి కల్వర్టుకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఎంపీడీవో శేఖర్, పీఆర్ ఏఈ రాజాజీ, పంచాయతీ కార్యదర్శి శిరీష కల్వర్టును పరిశీలించారు. నడింపల్లె వద్ద వంతెన గత ప్రభుత్వంలో కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో తాత్కాలికంగా కల్వర్టు ఏర్పాటు చేశారు. అయితే టీడీపీ అధికారంలోకి రావడంతో స్వర్ణముఖినదిపై శాశ్వత వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాలతో అంచనాలు వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు త్వరగా మంజూరు కావాలని.. తమ గ్రామానికి శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న బోధనాభ్యసన మేళా



బోధనాభ్యసన మేళాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

రామచంద్రాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక విద్యా శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనాభ్యసన మేళా ఆకట్టుకుంది. మండలంలోని మెడ్డీ కళాశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ప్రపంచ బ్యాంకు నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు 'ఎఫ్ఎల్ఎన్' అంశంపై శిక్షణ కార్యక్రమం విడతల వారీగా జరుగుతోంది. రెండు జిల్లాలోని 2,560 మంది ఉపాధ్యాయులు కార్యక్రమంపై శిక్షణ తీసుకొంటున్నారు. కార్యక్రమంలో శిక్షణ తరగతుల కోర్సు డైరెక్టర్ మధుసూదన్, కేఆర్పీలు, డీఆర్పీలు పాల్గొన్నారు.

స్థానికులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కిరణ్ రాయల్

తిరుపతి (జీవకోన), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రానున్న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని తిరుపతి స్థానికులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పించాలని జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ టీటీడీ పాలకమండలి, అధికారులను కోరారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలను పురస్కరించుకుని తిరుపతి వాసులకు రోజూ 20 వేల టికెట్ల చొప్పున 2 లక్షల మందికి దర్శన భాగ్యం కల్పించేలా టీటీడీ పాలకమండలి చర్యలు చేపట్టాలని కోరారు. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వంలో స్థానికుల పేరుతో కార్పొరేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, కావాల్సిన వారికి దర్శన టోకెన్లు అందించి దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. సమావేశంలో కిషోర్, మనోజ్, షరీఫ్, సాయిదేవ్, ఆది, పురుషోత్తం, సాయి, సుధా, శేషాద్రి, పవన్ పాల్గొన్నారు.

జిల్లాకు 380 ఆహార శుద్ధి పరిశ్రమ యూనిట్లు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లాకు 380 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేసిందని ఫుడ్ ప్రాసెసింగ్ ఈడీ సతీష్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పీఎంఎఫ్ఎంఈ పథకంతో ప్రాజెక్టు వ్యయంలో 90 శాతం రుణ వ్యయంతో పాటు 35 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. 18 ఏళ్లకు పైబడినవారు దరఖాస్తు చేసుకోవచ్చని.. జిల్లా అధికారులను సంప్రదించి కావాల్సిన ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని.. ప్రభుత్వ పరిశీలన తరువాత దరఖాస్తు బ్యాంకుకు అందజేయబడుతుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 7799128020 ను సంప్రదించాలన్నారు. అదనంగా లబ్ధిదారులకు ఎంఎస్ఎంఈగా గుర్తింపు పొందడానికి ఉద్యమ్ రిజిస్ట్రేషన్, ఆహార పరిశ్రమ నిర్వహణకు తప్పనిసరిగా పొందాల్సిన ఫుడ్ లైసెన్సులు ఈ పథకంలో నిర్ణీత రుసుంతో పొందవచ్చని తెలిపారు.

విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనకు టెక్నోఫెస్ట్ దోహదం



జ్యోతి వెలిగిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్‌రెడ్డి

తిరుపతి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభ, నైపుణ్యాలను వెలికి తీసేందుకు టెక్నో అండ్ గ్యాట్‌ఫెస్ట్ దోహదపడుతుందని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాష్‌రెడ్డి తెలిపారు. బైరాగిపట్టెడలోని కళాశాలలో ఏర్పాటు చేసిన మూడ్రోజుల టెక్నో అండ్ గ్యాట్ ఫెస్ట్-2కే24ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను మరింతగా పెంచుకోవాలని సూచించారు. డేటా అనాలిసిస్, వెబ్ డిజైన్, ఎర్రర్ డిటెక్షన్, పేపర్ ప్రజంటేషన్, గ్రూప్ డిస్కషన్, యంగ్ మేనేజర్, హెచ్ఆర్, మార్కెటింగ్ మంత్ర, ఫైనాన్స్ గేమ్, బిజినెస్‌ప్లాన్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, పి.మధుర పాల్గొన్నారు.

'మల్లిమడుగు' వద్ద తెరచుకోని సైఫన్లు

● తొమ్మిది గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

● గత ఐదేళ్లలో మరమ్మతులు చేయని ఫలితమిది



డ్యామ్ వద్ద మధ్యభాగంలోని ఐదు గేట్ల నుంచి దిగువకు నీరు వెళుతుండగా.. మరోపక్క సైఫన్లు తెరుచుకోక ప్రవహించని నీరు

రేణిగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాం నిండింది. అయితే ఆటోమేటిక్ సైఫన్లు తెరుచుకోకపోవడంతో తొమ్మిది గేట్లను ఎత్తి శుక్రవారం నీటిని విడుదల చేయాల్సి వచ్చింది. ఈ డ్యామ్‌కు ఎక్కడా లేనివిధంగా 40 సైఫన్లు ఏర్పాటు చేశారు. డ్యాం నిండితే ఆటోమేటిక్‌గా ఇవి తెరుచుకుని నీరు బయటకు వెళ్లేలా రూపొందించారు. 64ఏళ్లపాటు పనిచేశాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దీని నిర్వహణ పట్టించుకోలేదు. నిర్వహణకు టెండర్లు పిలిచినా.. బిల్లులు ఇస్తారో లేదనన్న అనుమానంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో 40లో 38 సైఫన్లు ఇప్పుడు తెరచుకోలేదు. డ్యామ్ పరిస్థితిని సమీక్షించిన అధికారులు ముందుజాగ్రత్తగా ఎడమ వైపున నాలుగు గేట్లు ఒక అడుగు మేర, మధ్యలో ఐదు గేట్లు మూడు అడుగుల మేరకు ఎత్తి దిగువకు నీటిని వదిలారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్సు దాడులు

● ఎనిమిది దుకాణాల్లో విక్రయాల నిలిపివేత



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు శుక్రవారం దాడులు చేశారు. విజిలెన్సు సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్, ఎస్.చంద్రశేఖర్, ఏజీ ధనంజయ టీములుగా విడిపోయి ఏకకాలంలో తిరుపతి, సదుం, పుంగనూరు, ఏర్పేడు, రొంపిచెర్ల తదితర ప్రాంతాల్లోని 20 దుకాణాలపై దాడులు చేశారు. స్టాకు, సేల్స్ రిజిస్టర్లను పరిశీలించారు. లైసెన్సులు ఉన్నాయా లేదా ఆరా తీశారు. స్టాకులో తేడాలుండడంతో రొంపిచెర్లలో రెండు, ఏర్పేడులో రెండు, తిరుపతిలో ఒకటి, సదుంలో రెండు, పుంగనూరులో ఒక దుకాణంలో విక్రయాలు ఆపేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రైతులకు కాకుండా పక్కదారి పట్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంట పొలాలపై ఏనుగుల దాడులు



ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా తోట

భాకరాపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పంట పొలాలపై ఏనుగుల దాడులు గత కొన్ని రోజులుగా జరుగుతూనే ఉన్నాయి. గత నెలలో విద్యుత్‌షాక్‌తో మగ ఏనుగు చనిపోయినప్పటి నుంచి మండలంలో భాకరాపేట, చిట్టేచర్ల, ఎగవూరు, దిగవూరు, నెల్లుట్లవారిపల్లె గ్రామాల్లోని పలువురు రైతుల పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి. గురువారం రాత్రి భాకరాపేటకు చెందిన రెడ్డి సుబ్రహ్మణ్యం టమోటా తోటను ధ్వంసం చేశాయి. అధికారులు స్పందించి ఏనుగులను అడవుల్లోకి మళ్లించాలని రైతులు కోరుతున్నారు.

రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శికి సన్మానం



పాకాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ పాకాల రైల్వే బ్రాంచ్ కార్యదర్శిగా స్థానిక అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ శివకుమార్ విజయం సాధించారు. శుక్రవారం మాజీ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి నారాయణస్వామి ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘ్ నాయకులు ఉదయకుమార్, దయానంద్, డేవిడ్ సుకుమార్, తులసీరామరెడ్డి, ఇస్మాయిల్ ఖాన్, మధు, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వేదంతోనే లోక సంరక్షణ

● కంచి మఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నకంచి మఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేదంతోనే లోక సంరక్షణ సాధ్యమని కంచి మఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి పేర్కొన్నారు. తిరుపతి బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో 44వ వార్షిక వేద విద్వాన్ మహాసభలు కంచి మఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేశారు. సనాతన ధర్మానికి వేదమే మూలమన్నారు. లోక సంరక్షణ జరగాలంటే, వేద పరిరక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. వేదంలో వేద భావం మాత్రమే ఉంటుందనీ, బేధ భావం ఉండదని స్పష్టం చేశారు. కుటుంబ వ్యవస్థ బాగా ఉండాలంటే విశాల దృక్పథంతో వేద మార్గాన్ని అనుసరించాలని కోరారు. ధర్మ ప్రచారం కోసం టీటీడీ వంటి మరింత గట్టి కృషి చేయాలని సూచించారు. టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు, సనాతన వైదిక ధర్మ రక్షణకు టీటీడీ తరపున రూ.25 కోట్ల శాశ్వత నిధి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. వేదం చదువుకున్న సుమారు 500 మంది విద్యార్థులకు శంకర విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేత సైకం జయచంద్రారెడ్డి తిరుపతి బ్రాహ్మణ సమాజానికి రూ.9 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, సూర్యనారాయణ, శివ సుబ్రమణ్యావధాని, యజ్ఞేశ్వరయాజులు, బ్రాహ్మణ సమాజ అధ్యక్షుడు వెంకటాచలం, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లె అజయ్‌కుమార్, భీమాస్ బాలాజీ, వెంకట పెరుమాళ్, రామశర్మ, భీమాస్ అశోక్, ప్రభాకర్, హరి, ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్, వేద విద్యార్థులు పాల్గొన్నారు.


ఉధృతంగా నక్కలవాగు



ముండ్లపూడి, పాడిపేట వద్ద నక్కలవాగు

తిరుచానూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖి నది ఓ మోస్తారుగా ప్రవహిస్తోంది. తిరుచానూరు వద్ద తాత్కాలిక వంతెనను తాకుతూ ఉధృతంగా నదీ ప్రవాహం సాగుతోంది. చాలా రోజుల తరువాత స్వర్ణమ్మ ప్రవహిస్తుండటంతో స్థానికులు నదీమ తల్లికి కర్పూర హారతులు ఇచ్చారు. స్వర్ణముఖి పారడంతో పరిసర గ్రామాల్లో బోవులు, బావుల్లోకి నీరు చేరాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోసారి భారీ వర్షం పడితే స్వర్ణముఖి ఉధృతికి నదికి తాత్కాలిక వంతెనలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని తిరుపతి రూరల్ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాయలచెరువు నుంచి వచ్చే నక్కలవాగు ముండ్లపూడి, పాడిపేటలో ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నాని నక్కలవాగును పరిశీలించి ఇళ్లలోకి నీరు వెళ్లకుండా కాలువ పూడిక తీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

కళ్యాణి డ్యామ్‌లో పెరుగుతున్న నీటిమట్టం



కళ్యాణి డ్యామ్‌లో పెరుగుతున్న నీటి మట్టం

చంద్రగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎ.రంగంపేట సమీపంలోని కళ్యాణి డ్యామ్‌లో రోజురోజుకు నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి కళ్యాణి డ్యామ్‌లోకి శేషాచలం అడవి వాగుల్లో నుంచి వరద నీరు చేరుతున్నాయి. ఫెంగల్ తుఫాన్‌కు ముందు కళ్యాణి డ్యామ్‌లో 841 అడుగుల నీటి మట్టం ఉండేది. అయితే గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం సాయంత్రానికి 867 అడుగుల వరకు నీటి మట్టం పెరిగిందని అధికారులు తెలిపారు. శేషాచలం అడవుల్లోని రాగిమానుకోన, అనుమకోన, అబ్బాలమేరు, చీకుమానుకోన, గుండాలపెంట వాగులు నుంచి వరద నీరు డ్యామ్‌లోకి వస్తోంది. వర్షాలు కురిస్తే మొత్తం డ్యామ్‌లో నీటి మట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



గాంధీపురంలో శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అవిలాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం మండలస్థాయి అధికారులతో పలు సమస్యలపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సమీక్షించారు. ఆంధ్రాబ్యాంక్ కాలనీ, వినాయకనగర్, అవిలాల గ్రామాన్ని సందర్శించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఆరునెలల్లో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆంధ్రాబ్యాంకు కాలనీలో రూ.12 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో సీసీరోడ్డు, మురుగునీటి కాలువల పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వర రెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు సాంబశివయ్య, కురకాల్వ సుధాకర్, సర్పంచ్ సి.వెంకటరమణ, ఉపసర్పంచ్ గోపాల్, ఎంపీడీవో రామచంద్ర, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, తుడా, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

● గాంధీపురం పంచాయతీని సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులతో కలిసి శ్మశానాన్ని పరిశీలించారు. శ్మశాన స్థలాన్ని తక్షణమే శుభ్రం చేసి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్పంచ్ ఎం.లక్ష్మి, టీడీపీ నేతలు ధనంజయయాదవ్, ధనారాయల్ కృష్ణయ్య పాల్గొన్నారు.

తిరుచ్చిపై సిరులతల్లి అభయం



తిరుచ్చిపై ఊరేగుతున్న అమ్మవారు

తిరుచానూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన శ్రీపద్మావతిదేవి బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. శుక్రవారం వేకువజామున సుప్రభాతసేవతో అమ్మవారిని మేల్కొపి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ అనంతరం స్నపన తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. అన్నమయ్య కీర్తనలతో ప్రముఖ గాయకురాలు డాక్టర్ శోభారాజ్ ఆలపించారు. అలంకార శోభితురాలైన పద్మావతిదేవి బంగారు తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

నిండిన పాకాల పెద్దచెరువు



వృథాగా పోతున్న పాకాల పెద్దచెరువులోని నీళ్లు

పాకాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట, మద్దినాయనిపల్లె పరిసరాలలో చెరువులు నిండి మొరవబోతున్నాయి. పాకాల వంకలో భారీగా నీరు ప్రవహిస్తున్నాయి. దీంతో పాకాల పెద్దచెరువు పూర్తిస్థాయిలో నిండింది. మూడేళ్ల క్రితం కురిసిన వర్షాలకు చెరువులో భారీగా నీరు చేరడంతో కట్టకు ముప్పు వస్తుందని మొరవను తొలగించి నీరు కిందికి వదిలేశారు. అప్పటినుంచి మరమ్మతులు చేయలేదు. ఇటీవల మొరవకు అడ్డంగా ఇసుక బస్తాలు వేశారు. రెండు రోజులుగా చెరువుకు నీరు భారీగా రావడంతో వేసిన ఇసుక బస్తాలు ఓ వైపు కొట్టుకుపోయి చెరువులో నీరు వృథాగా పోతున్నాయి. ఈ చెరువు కింద 300 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువులో నీరు నిల్వ ఉంటే పాకాల పరిసర ప్రాంతాలలో బోర్లు, బావుల్లో పుష్కలంగా భూగర్భజలం అందుబాటులో ఉంటుంది. తొలగించిన మొరవను తనిర్మించి చెరువుకట్ట బలోపేతం చేయాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే పదిపుట్లబైలు రిజర్వాయర్, పెద్దరామాపురం అమ్మచెరువు, గానుగపెంట రామసముద్రం చెరువు, మొగరాల చెరువు, రామిరెడ్డిచెరువు, కెవడ్డేపల్లె కర్నం చెరువు, అమ్మచెరువు, వల్లివేడు మల్లేశ్వరస్వామి చెరువులు జలకళ సంతరించుకున్నాయి.

వేడుకగా ఊంజలసేవ



నారాయణవనం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు. అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆల యాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం



పాకాల: సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ రోస్‌మండ్

పాకాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ రోస్‌మండ్ అన్నారు. శుక్రవారం మొగరాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. సదస్సులో ప్రజలు వివిధ సమస్యలపై 97 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు నిత్యానందబాబు, సర్పంచ్ మధునాయుడు, మాజీ సర్పంచ్ ఆర్ ఆనందచౌదరి, మాజీ వైస్ ఎంపీపీ బాలశంకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● చంద్రగిరి: ఎ.రంగంపేట పంచాయతీలో శుక్రవారం తహసీల్దారు శివరామసుబ్బయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజలు అర్జీలు అందించారు. సదస్సులో సర్పంచ్ ఎర్రయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె, జంగావాండ్లపల్లె గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దారు జనార్దన్‌రాజు, సర్పంచులు మాధవి, విమల, డీటీ వాసుదేవ కుమార్, ఆర్ఐ జానకీరామ్, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్లు గణేశ్, కేశవులు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● రామచంద్రాపురం: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ కోరారు. కేకేవీపురంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వివిధ సమస్యలకు సంబంధించి 24 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ,సిబ్బంది పాల్గొన్నారు.

● తిరుపతి రూరల్: నిషేధిత జాబితా(22ఏ) నుంచి తమ భూములని తొలగించాలని చిగురువాడకు చెందిన పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. చిగురువాడ పంచాయతీలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దారు రామాంజులునాయక్‌కు అర్జీలు అందించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి, వీఆర్వో రమేష్, అధికారులు, టీడీపీ నేతలు శ్రీనివాసులు యాదవ్, శివాయాదవ్, సుధాకర్‌రెడ్డి, మురళి, మల్లీశ్వరరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాలలో ఏడాది పాటు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు ల్యాబ్ టెక్నీషియన్, డేటా మేనేజరు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాన్ కమ్యూనికబుల్ డిసీస్ కంట్రోల్, యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) సర్వేలన్స్ ప్రోగ్రాం కింద ఏడాదిపాటు కాంట్రాక్టు కింద పనిచేసేందుకు అర్హులు ఈనెల 26 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

నేడు రామ్‌సింగ్ పర్యటన

రామచంద్రాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్తు రెగ్యులేటింగ్ కమిషన్ చైర్‌పర్సన్ రామ్‌సింగ్ శనివారం ఆర్‌సీపురంలో పర్యటించనున్నట్లు పుత్తూరు ఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆశీర్వాదం తెలిపారు. కుప్పంబాదూరు గ్రామంలోని రాయలచెరువుపేట విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన పరిశీలిస్తారన్నారు. అనంతరం వెదురుకుప్పం మండలం పచ్చికాపలం సమీపంలోని ఎర్రగుంట విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తారన్నారు. విద్యుత్తుశాఖ అధికారులు చైర్మన్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

విజయోత్సవ ర్యాలీ



పాకాల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో జరిగిన ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం సాధించడంపై స్థానిక యూనియన్ నాయకులు శుక్రవారం సాయంత్రం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు కార్మికులు ర్యాలీ చేశారు. పాకాల బ్రాంచి చైర్మన్ పి.సురేష్ బాబు, కార్యదర్శి డి.శేఖర్, ట్రెజరర్ జె.వెంకటముని కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు.

వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా విజయభాస్కర్



తిరుపతి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట జెడ్పీ హైస్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయులు టి.విజయభాస్కర్‌ను వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎం.మునిశారద పేర్కొన్నారు. బైరాగిపట్టెడలోని ఎంజీఎం హైస్కూల్‌లో నిర్వహించిన సంఘ సమావేశంలో ఎన్నికల పరిశీలకులు బి.గణేష్ సమక్షంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. విజయభాస్కర్ మాట్లాడుతూ టీచర్ల సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మేతకెళ్లాలంటే గాజులేరు దాటాల్సిందే!



పశువులను ఏరు దాటిస్తున్న పాడి రైతు

ఎర్రావారిపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదయ మాణిక్యం పంచాయతీ పుట్టావాండ్లపల్లె హరిజనవాడ, ఎస్టీ కాలనీ వాసులు పశువులు మేతకు తీసుకెళ్లాలంటే ఏరు దాటాల్సిందే. కురుస్తున్న వర్షాలకు ఏరు ప్రవహిస్తోంది. పల్లెలోని రైతులు పాడిపైన ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలోనే ఎల్లమంద, ఉస్తికాయల పెంట, అన్నమయ్య జిల్లా సుండుపల్లె, రాయచోటి ప్రాంతాలకు ప్రయాణాలు చేస్తుంటారు. పశువులు మేతకు వెళ్లాలంటే ఏటి వరద నీటిని దాటాలి. అధికారులు స్పందించి అనువుగా వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

నీటి సంఘ ఎన్నికలకు సమాయత్తం కావాలి

చంద్రగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో శనివారం జరిగే నీటి సంఘం ఎన్నికలకు వైసీపీ కార్యకర్తలు, నాయకులు సమాయత్తం కావాలని ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చంద్రగిరిలో కార్యాలయంలో ఆపార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో జరిగే పది చెరువుల సాగునీటి సంఘ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైసీపీ మద్దతుదారులు, రైతులు సిద్ధం కావాలన్నారు. అనంతరం వైసీపీ కమిటీలను ఏర్పాటు చేశారు. సమావేశంలో జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, డివిజన్ పార్టీ అధ్యక్షులు అగరాల దేవారెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ బోస్ చంద్రారెడ్డి, వైసీపీ నాయకులు యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రకాష్ రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నగరి చంద్రశేఖర్‌రెడ్డి, మదన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రుయాలో ఈఎన్‌టీ సేవలు మృగ్యం

చుట్టపుచూపుగా వైద్యుల విధులు

పది గంటలకు కూడా హాజరుకాని వైనం

ప్రైవేటు ఆస్పత్రులకు వస్తే మెరుగైన వైద్యం పొందవచ్చని రోగులకు హితబోధ



ఈఎన్‌టీ విభాగంలో ఉదయం 10 గంటలకు ఖాళీగా దర్శనమిస్తున్న వైద్యాధికారుల గది



వైద్యుల కోసం నిరీక్షిస్తున్న రోగులు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ల వాడకం, శబ్ద కాలుష్యం కారణంగా చెవికి సంబంధించిన సమస్యలతో అనేక మంది బాధపడుతున్నారు. మారుతున్న వాతావరణం వల్ల ముక్కు, గొంతు సమస్యలతో బాధపడే వారి సంఖ్య కూడా బాగా పెరిగింది. ఈ క్రమంలో ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు) వైద్యం కోసం రుయాస్పత్రికి రోగులు క్యూ కడుతున్నారు. గతంలో రోజుకు 30 నుంచి 40 మంది రోగులు మాత్రమే ఓపీకి వచ్చేవారు. ఇప్పుడు ఆ సంఖ్య 80కు పైగా పెరిగింది. మంగళ, శుక్రవారం రోజుల్లో సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చే వారిలో అధికంగా చెవి సమస్య ఉన్నవారే. ఆ రెండు రోజుల్లో ఈఎన్‌టీ విభాగంలో ఓపీ రెండింతలు పెరుగుతుంది. అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండటంతో వైద్య సేవలు అరకొరగానే అందుతున్నాయి. సాధారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓపీ వైద్య సేవలు అందించి, 3-5 గంటల మధ్య రోగుల రిపోర్టులు పరిశీలించి అవసరమైన వైద్య సేవలు అందించాలి. కానీ వైద్యులు 10 గంటలకు కూడా రావడం లేదు. ఆపైన వచ్చినా 12 గంటలు దాటితే ఒక్క నిముషం కూడా ఉండటంలేదు. ఆ తరువాత కేవలం వైద్య విద్యార్థులు మాత్రమే అందుబాటులో ఉంటున్నారని రోగులు పేర్కొంటున్నారు. వారు కూడా మధ్యాహ్నం 12.30 దాటితే 'సమయం ముగిసింది రేపు రండి' అంటూ పంపేస్తున్నారని చెబుతున్నారు. కొందరు డాక్టర్లు 'ఇక్కడ వైద్య పరికరాలు సరిగా లేవు..దగ్గర్లోని మా క్లినిక్‌కు వస్తే బాగు చేస్తామని' చెప్పి పంపుతున్నారు. ఈ క్రమంలో రోజూ ఓపీ వంద వరకు వస్తున్నా వైద్య సేవలు మాత్రం 40 మందికి కూడా అందడం లేదు. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

'ఆడపిల్లలను చదివిద్దాం.. కాపాడుకుందాం'



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలను చదివిద్దాం.. వారి హక్కులను కాపాడుదామని ఇన్‌చార్జి కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కిశోరి వికాసం జిల్లా స్థాయి శిక్షణా సమావేశం నిర్వహించారు. శుభం బన్సల్ మాట్లాడుతూ బాల్య వివాహాల అనర్థాలు, రక్తహీనతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీడీపీవోలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు ఆ మేరకు క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. చదువుకు దూరమైన బాలికలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అధికారి జయలక్ష్మి మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ, వారి చదువు కోసం అందరూ నడుం బిగించాలన్నారు. అనంతరం అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, జిల్లా నైపుణ్యాధికారి లోకనాథం, మహిళా డీఎస్పీ శ్రీలత, జిల్లా విద్యాశాఖ అధికారి కేవీఎన్‌కుమార్, డీఎంహెచ్‌వో శ్రీహరి పాల్గొన్నారు.

సురక్షితమైన నీటిని అందించండి



తిరుపతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజలకు సురక్షితమైన నీరు సరఫరా చేయాలని, పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. వర్షాల వలన నీరు నిలిచిన లక్ష్మీపురం, నారాయణపురం తదితర ప్రాంతాలను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి శుక్రవారం ఉదయం ఆమె పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా కాలువల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేసి నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

- చేపల మార్కెట్ మార్చండి

మెయిన్ రోడ్డు పక్కనే చేపల మార్కెట్ ఉండడం వల్ల దుర్గంధం వస్తోందని ఫిర్యాదులు రావడంతో కమిషనర్ పరిశీలించారు. మార్కెట్‌కు వెనుక వైపు ఉన్న ప్రాంతంలోకి మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఎస్‌ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసికుమార్, గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజి, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

పారిశుధ్యానికి పెద్దపీట వేయాలి

తిరుపతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇళ్లు, వ్యాపార సముదాయాల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం ఆమె సమీక్షించారు. చెత్త వాహనాలు ఏయే మార్గాల్లో ఎన్ని గంటలకు వెళుతున్నాయి? వాహనంతో పాటు ఎంతమంది వెళుతున్నారు? అనే విషయాలు నమోదు చేయాలన్నారు. వందశాతం ముఖ ఆధారిత హాజరు నమోదు చేపట్టాలని అన్నారు. తెల్లవారుజామునే నగరంలోని చెత్త కుప్పలు తొలగించి, పారిశుధ్య పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. బల్క్‌వేస్ట్ జనరేటర్స్‌ను గుర్తించి వారే చెత్త నిర్వహణ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

వైద్య రంగంలో ఉపాధి అవకాశాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మనోహర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు అపారంగా పెరిగాయని స్కిల్ ఇంటర్నేషనల్ ట్రైనింగ్స్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఈడీ మనోహర్ పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైద్య విద్య, ఉపాధి రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భవాని పాల్గొన్నారు.

గూడూరు ఎయిడెడ్ పాఠశాల ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గూడూరులోని ఎస్పీఎస్ అప్పర్ ప్రైమరీ ఎయిడెడ్ స్కూల్లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టు-1, తెలుగు లాంగ్వేజ్ పండిట్-1, హిందీ లాంగ్వేజ్ పోస్టు-1 డైరెక్ట్ నియామకం ద్వారా భర్తీ చేసేందుకు పాఠశాల కరస్పాండెంట్ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. https://cse.ap.gov.in/AidedRecruitment లింక్ ద్వారా ఆన్‌లైన్‌లోగాని, పాఠశాల కరస్పాండెంట్ వద్దగాని దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



అపర్ణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర యూనివర్సిటీ జువాలజీ విభాగ పరిశోధకురాలు వై. అపర్ణ డాక్టరేట్ పొందారు. ఎఫిసియస్సీ ఆఫ్ బయోఫ్లాక్స్ ఇన్ ద కల్చర్ ఆపరేషన్ ఆఫ్ పసిఫిక్ వైల్ ష్రింప్ లిటోపెనిక్విస్ వన్నమెయి అంశంపై రిటైర్డు ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఆమె పరిశోధన పూర్తి చేశారు.

మనసు పరిమళించెనే..!

ఆకట్టుకున్న ఘంటసాల సంగీత విభావరి



ఘంటసాల పాటలు పాడుతున్న కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మనసు పరిమళించెనే.. తనువు పరవశించెనే.. నవ వసంత రాగంతో.. నీవు చెంత నిలువగనే.. అంటూ సాగిన ఘంటసాల సంగీత విభావరి ఆద్యంతమూ ఆకట్టుకుంది. తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో మహతి ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం 354వ సంగీత విభావరి నిర్వహించారు. ఎస్‌బీటీ అధినేత వెంకటేశ్వర చౌదరి మాట్లాడుతూ సంగీతం మనసును ఆహ్లాదకరంగా మారుస్తుందన్నారు. తిరుపతిలో సంగీత ప్రదర్శన చేయడం అభినందనీయమన్నారు. గేట్ కాలేజీ వెంకటేశ్వర్లు, మ్యూజిక్ కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ సుధాకర్, పారిశ్రామికవేత్త పీసీ రాయలు, హరిణి కన్‌స్ట్రక్షన్స్ అధినేత సనత్‌కుమార్ సంగీతం గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు వైఎస్ బాబు, కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి ప్రసాదరావు, ఉపాధ్యక్షులు బుజ్జిబాబునాయుడు, మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న భానుప్రకాశ్‌రెడ్డి - సాంస్కృతిక ప్రదర్శనలు

వేడుకగా యువ ఉత్సవ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంరు 13 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పద్మావతి యూనివర్సిటీలోని ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో శుక్రవారం సాయంత్రం యువ ఉత్సవ్ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ యువత తమలోని ప్రతిభను ప్రదర్శించడానికి ఇదో చక్కని వేదిక అని తెలిపారు. సమాజం పట్ల అవగాహన, బాధ్యతను యువత పెంపొందించుకోవాలని కోరారు. జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మహనీయులను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జ్ఞానశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచానికి దేశం దిక్సూచిగా నిలవడానికి యువత తమవంతు కృషి చేయాలన్నారు. ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆహార, వస్తు ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కొత్తపల్లి డ్రైనేజీ కాలువపై సేఫ్టీ గోడ నిర్మించండి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కొత్తపల్లి వద్ద డ్రైనేజీ కాలువపై సేఫ్టీ గోడ నిర్మించాలని సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రమణ్యం డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం నాయకుల బృందం కొత్తపల్లి ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న పెద్ద కాలువపై కాజ్‌వే నిర్మించి, రక్షణగా గోడ నిర్మించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించారు. గోడ నిర్మించాలని కోరారు. నాయకులు బుజ్జి, నరేంద్ర, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రవి కథనం మేరకు.. ప్లాట్‌ఫాం 5లో సుమారు 55 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలూ లేవు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు. గుర్తు పట్టిన వారు 831759104 కు సమాచారం ఇవ్వాలని హెచ్‌సీ కోరారు.

రాజేశ్వరీమూర్తి మృతి పట్ల పలువురి సంతాపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పద్మావతి కాలేజీ రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ కంభంపాటి రాజేశ్వరీమూర్తి మృతి పట్ల పద్మావతి డిగ్రీ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్ళు భద్రమణి, భువనేశ్వరీదేవి, విశ్రాంత అధ్యాపకురాలు మీనాకుమారి, పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధి డాక్టర్ డీఎం ప్రేమావతి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ కృష్ణవేణి, కాలేజీ పూర్వ విద్యార్థిని, టీటీడీ పీఆర్వో నీలిమ తదితరులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాలేజీలోని శ్రీదేవి, భూదేవి, శ్రీనివాస, గాంధీ, నెహ్రూ హాస్టల్ భవనాలను రాజేశ్వరీమూర్తి హయాంలోనే నిర్మించారని గుర్తుచేసుకున్నారు. మూడంతస్తుల కాలేజీ భవనాన్ని రాతి కట్టడాన్ని అద్భుతంగా చేపట్టారని కొనియాడారు. రెండు దశాబ్దాల పాటు ప్రిన్సిపాల్‌గా పనిచేసి కాలేజీని అన్ని విధాలుగా రాజేశ్వరీమూర్తి అభివృద్ధి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆమె మృతి తీరని లోటన్నారు.

నేడు సంతాప సభ

రాజేశ్వరీమూర్తి మృతి నేపథ్యంలో పద్మావతి డిగ్రీ కాలేజీలో శనివారం సంతాప సభ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు కాలేజీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

వేడుకగా కృత్తికా దీపోత్సవం



కృత్తికా దీపోత్సవంలో భక్తులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరాలయంలో కృత్తికా దీపోత్సవం వేడుకగా సాగింది. కృత్తికా నక్షత్రం సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఆలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల శివనామస్మరణ, హర హర మహాదేవ శంభో శంకర అనే మంత్రోచ్ఛరణల మధ్య దీపోత్సవం అత్యంత భక్తి పారవశ్యంతో చేపట్టారు. వర్షం నేపథ్యంలో జలపాతం హోరు కారణంగా పుష్కరిణిలోకి భక్తులను అనుమతించలేదు. దీంతో ఆలయ ప్రాంగణంలోనే మహిళలు నెయ్యి దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. గర్భాలయంలోని కపిలేశ్వర స్వామి ఆలయ గోపురం, కామాక్షి అమ్మవారి ఆలయ గోపురం, ధ్వజ స్తంభంపై దీపారాధన చేశారు. ఊంజల్ మండపంలో ఆకట్టుకునేలా శివలింగం, శూలం ఆకృతిలో ప్రమిదలు వెలగించారు. అనంతరం జ్వాలా తోరణం వెలిగించారు. కార్యక్రమంలో జేఈవో గౌతమి, వీజీవో సదాలక్ష్మి, డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దల మందలింపుతో విద్యార్థిని ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలిసిపోయిందనే భయంతో ఇంజనీరింగు విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి శివజ్యోతినగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ లోకేష్‌బాబు కథనం మేరకు.. పులిచెర్లకు చెందిన ఉమేష్ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ చెల్లెలు గాయత్రితో కలసి శివజ్యోతినగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గాయత్రి బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె ప్రేమలో పడినట్లు తెలుసుకుని కుటుంబ సభ్యులు మందలించారు. మనస్థాపంతో ఆమె శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బయటకు వెళ్లి వచ్చిన ఉమేష్ ఈ విషయాన్ని గమనించి అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ లోకేష్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి, గాయత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. శవ పరీక్ష నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గాయపడిన వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత నెలలో మిద్దెపై నుంచి పడి గాయపడిన కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం మృతిచెందారు. ఈస్ట్ ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు...సౌత్ సెంట్రల్ రైల్వేలో సీనియర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు ఐదేళ్లుగా హైబీపీతో బాధపడుతున్నారు. గతనెల 21వ తేదీరాత్రి భోజనం చేసిన తర్వాత మొదటి అంతస్తులోని వరండాలో తిరుగుతుండగా కళ్లు తిరిగి కిందపడ్డారు. తలకు బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను తిరుపతి రుయాకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం నారాయణాద్రి ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



పూర్తి సామర్థ్యంలో కళకళలాడుతున్న పూలవానిగుంట చెరువు - మొరవపారుతున్న చెన్నాయిగుంటచెరువు

నిండుకుండలా చెరువులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ పరిధిలోని చెరువులన్నీ నిండుకుండలా కళకళలాడుతున్నాయి. ఈనెల మొదటి వారంలో, గత రెండు రోజుల్లో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. శేషాచల కొండల నుంచి పట్టణం మీదుగా వర్షపు నీరు చేరడంతో చెరువులు మొరవపోతున్నాయి. మూడేళ్ల తర్వాత అన్ని చెరువులు పూర్తిస్థాయిలో నిండి జలకళను సంతరించుకున్నాయి. పాక చెరువు, పూలవానిగుంటచెరువు, అన్నాచెరువు, మంచినీళ్లగుంట, చింతమాకులగుంట, మంగళంచెరువు, శెట్టిపల్లెచెరువు, చక్రాలబండచెరువు, చెన్నాయిగుంట చెరువులు నిండుకుండలను తలపిస్తూ ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి. చెన్నాయిగుంట చెరువు మొరవపోతుండడం, చేపలు ఎగబడుతుండడంతో స్థానికులు వాటిని పట్టే పనిలో పడ్డారు.


తిరుమల నడకదారిలో హైదరాబాద్‌వాసి మృతి



రవికుమార్ మృతదేహం

తిరుమల, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో సరదా మాట్లాడుతూ.. ఉల్లాసంగా నవ్వుతూ మెట్లెక్కుతున్న ఓ యువకుడు హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. గుండె పట్టుకుని పడిపోయిన మిత్రుడికి ఏమైందో తెలియక పైకి లేపేందుకు ప్రయత్నించారు తోటి స్నేహితులు. పక్కన భక్తులు, సమీపంలోని సిబ్బందితో కలిసి ఆగమేఘాలపై తిరుమలలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడంటూ వైద్యులు సూచించారు. మరి కొన్ని గంటల్లో స్వామిని దర్శించుకుంటామనుకునేలోపే ఇలా జరిగిందంటూ స్నేహితులు ఆవేదన చెందారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌కు చెందిన సీహెచ్ రవికుమార్(38) మరో ఐదుగురు స్నేహితులతో కలిసి శుక్రవారం ఉదయం తిరుపతికి చేరుకున్నాడు. దర్శనానికి సమయం ఉండటంతో శ్రీకాళహస్తికి వెళ్లి తిరిగి మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. మొక్కు ఉన్న క్రమంలో అలిపిరి నుంచి తిరుమలకు కాలినడకను ప్రారంభించారు. అలిపిరిలో కొబ్బరికాయలు కొట్టి స్నేహితులతో మాట్లాడుకుంటూ 2,500వ మెట్టువరకు చేరుకున్నారు. అప్పటివరకు సరదాగా కనిపించిన రవికుమార్ ఒక్కసారిగా ఛాతీ నొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. వెంటనే స్నేహితులందరూ పైకి లేపేందుకు చాలా ప్రయత్నించారు. ఎంతకీ లేవకపోవడంతో అంబులెన్స్‌లో తిరుమలలోని ఆస్పత్రికి తీసుకొచ్చారు. రవికుమార్‌ను పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. దీంతో ఇక లేడనే వార్తను స్నేహితులు జీర్ణించుకోలేకపోయారు. రవికుమార్ అన్నకు సమాచారమిచ్చారు.

కపిలతీర్థంలో కార్తీక దీపోత్సవం



కార్తీకదీపం వెలుగిస్తున్న గాండ్ల కులస్తులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కపిలతీర్థంలో శుక్రవారం స్థానిక గాండ్ల కులస్తుల ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ముందుగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, అర్ధాకారపు మట్టికుండలో నేతిదీపాన్ని వెలిగించారు. కార్యక్రమంలో గాండ్ల కులస్తులు పాతలపాటి శేఖర్, ప్రసాద్‌బాబు, బండారు శ్రీనివాసులు, రామచంద్ర, దాము, రాజేంద్ర, బాల పాల్గొన్నారు.

చేపల వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపండి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపం సమీపంలో చేపల వ్యాపారం చేసుకుంటున్న వ్యాపారులను అక్కడి నుంచి తొలగిస్తే ప్రత్యామ్నాయం చూపాలని వీధి వ్యాపారుల సంఘం నాయకులు శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగర పాలక కమిషనర్‌ను కలసి వినతిపత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలకు వాహనం వితరణ



వెంకట్‌కు వాహనం అందజేస్తున్న బ్యాంకు జీఎం భాస్కర్‌రావు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఎస్వీ వైద్య కళాశాలకు అవసరమైన రూ.20 లక్షల విలువచేసే 12 సీట్ల ఫోర్స్ వాహనాన్ని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) వారు శుక్రవారం అందించారు. యూబీఐ బ్యాంకు జనరల్ మేనేజరు సీవీఎన్ భాస్కర్‌రావు వాహనాన్ని కళాశాల ఆవరణలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకట్‌కు అందజేశారు. బ్యాంకు సిబ్బందికి వెంకట్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూబీఐ రీజనల్ డైరెక్టర్ రామప్రసాద్, మేనేజరు స్వాతి, వైద్యులు డీఎస్ఎన్ మూర్తి, సునీత పాల్గొన్నారు.



వామ్మో..!

తిరుమల శ్రీవారిసేవసదన్ వెనుకభాగంలోని గార్డెన్‌లో శుక్రవారం ఈ భారీ నాగు పాము పట్టుబడింది. పామును గుర్తించిన గార్డెన్ సిబ్బంది పాములు పట్టే భాస్కర్‌నాయుడికి సమాచారం ఇచ్చారు. చాకచక్యంగా దీనిని పట్టుకున్న ఆయన, ఆ తర్వాత అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి





అక్కగార్లకు కార్తీక పూజలు

తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులోని అక్కగార్లకు శుక్రవారం ఉదయం టీటీడీ రవాణా విభాగం ఆధ్వర్యంలో కార్తీకమాస పూజ జరిగింది. డ్రైవర్లు, స్థానికులు కలిసి అక్కదేవతల ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అనంతరం టీటీడీ రవాణా విభాగం అధికారులు, సిబ్బంది సారె సమర్పించారు. కనుమరోడ్లలో భక్తులు సురక్షితంగా ప్రయాణాలు సాగించేలా అనుగ్రహించాలని అక్కదేవతలను ప్రార్థించారు. టీటీడీ లా ఆఫీసర్ వరప్రసాద్‌రావు, డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి పాల్గొన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రేపు కార్తీకదీపోత్సవం

పౌర్ణమిగరుడసేవ రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 15న కార్తీక పౌర్ణమి నాడు దీపోత్సవం జరుగుతుంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయిన తర్వాత నేతి వత్తులతో దీపాలను వెలిగించి ఛత్రచామర, మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా విమాన ప్రదక్షిణం చేస్తూ ఆనంద నిలయంలోని శ్రీవారికి హారతి ఇస్తారు. ఈ తర్వాత వరుసగా గర్భాలయంలో అఖండం, కులశేఖరపడి, రాములవారి మేడ, ద్వార పాలకులు, గరుడ్వాళ్వారు, వరదరాజస్వామి, వకుళమాత, బంగారుబావి, కల్యాణమండపం, సభ అర, తాళ్ళాపాక అర, భాష్యకారుల సన్నిధి, యోగనరసింహస్వామి, విష్వక్సేనులు, చందనం అర, పరిమళ అర, వెండివాకిలి, ధ్వజస్తంభం, బలిపీఠం, క్షేత్రపాలకుల సన్నిధి, తిరుమలరాయమండపం, పూలబావి, రంగనాయక మండపం, మహాద్వారం, బేడి ఆంజనేయస్వామి, శ్రీవరాహస్వామిఆలయం, స్వామి పుష్కరిణి వద్ద దీపాలను వెలిగిస్తారు. ఈసందర్భంగా సహస్ర దీపాలంకారసేవను, పౌర్ణమి గరుడసేవను టీటీడీ రద్దు చేసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



దర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులూ, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులూ వేచి ఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.85 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 61,178

తలనీలాలు సమర్పించినవారు: 22,464



చదువులమ్మ కన్నుమూత

పద్మావతి కాలేజీ రూపశిల్పి రాజేశ్వరీమూర్తి మృతి

104వ పుట్టిన రోజు జరుపుకున్న మూడు రోజులకే న్యూయార్క్‌లో ఆఖరిశ్వాస

తిరుపతి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పద్మావతి మహిళా కళాశాల రూపశిల్పి రాజేశ్వరీ మూర్తి శుక్రవారం కన్నుమూశారు. ఈనెల 10న న్యూయార్క్‌లోని తన ఇంట్లో 104వ పుట్టినరోజును జరుపుకున్న ఆమె రెండు రోజుల కిందట అస్వస్థతకు గురయ్యారు. అక్కడి ఆసుపత్రిలో భారత కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళా కళాశాల రూపశిల్పిగా ఆమె కృషి ఎనలేనిది. టీటీడీ ఆధ్వర్యంలో 1952లో పద్మావతీ మహిళాకళాశాల ప్రారంభం అయింది. 1954లో కళాశాల ప్రిన్సిపాల్‌గా కాకినాడకు చెందిన రాజేశ్వరీ మూర్తి నియమితులయ్యారు. 22 ఏళ్ల పాటు ఈ బాధ్యతల్లో ఉన్న ఆమె అందించిన సేవలు అనన్యసామాన్యమైనవి. కళాశాల భవనాల నిర్మాణం మొదలు, లైబ్రరీ, లేబరేటరీ, హాస్టళ్ల దాకా ప్రతిదీ ఆమె కనుసన్నల్లో ఏర్పాటయ్యాయి. పద్మావతి కాలేజీలో చదువుకున్న వందలాది మంది విద్యార్థులు వివిధరంగాల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారంటే దాని వెనుక ఈమె కృషే కనిపిస్తుంది.



అమెరికాలో 104వ పుట్టిన రోజు వేడుకల్లో రాజేశ్వరీమూర్తి

గొప్ప విద్యావేత్త : ఆడవాళ్లకు చదువులెందుకు అనే రోజుల్లో కాకినాడకు చెందిన రాజేశ్వరీమూర్తి పీయూసీ చేశారు. ఆ తర్వాత చదువు సాగలేదు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రొఫెసర్‌గా చేస్తున్న మూర్తితో పెళ్ళయ్యాక, ఆయన ప్రోత్సాహంతో చదువు కొనసాగించారు. బీఎస్సీ ఆనర్స్ చేసి అదే కాలేజీలో గణిత బోధకురాలిగా చేరారు. అప్పటి టీటీడీ చైర్మన్‌ చెలికాని అన్నారావు ఆహ్వానం మేరకు ఆమె పద్మావతీ కాలేజి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1976 దాకా పద్మావతిలోనే పనిచేశారు. వీరికి పిల్లలు లేరు. భర్త చనిపోయాక అమెరికాకు వెళ్లారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో పోస్ట్ డాక్టొరల్ చేశారు. 'కమ్యూనిటీ కాలేజీస్ ఆఫ్ ఇండియా' అనే అంశంపై పరిశోధన చేశారు. అమెరికాలోని యునైటెడ్ నేషన్స్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ కేంద్రంలో రిజిస్ట్రార్‌గా రిటైరయ్యారు. అమెరికా పౌరులకు మాత్రమే ఇచ్చే బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ అవార్డును ఆమె అందుకున్నారు.

ఆఖరి కోరిక తీరకుండానే..

రాజేశ్వరీమూర్తి మృతితో ఆమె శిష్యులు కన్నీటితో ఆమె జ్ఞాపకాలు తలపోసుకుంటున్నారు. "పద్మావతి కాలేజి అంటే రాజేశ్వరీమూర్తికి ప్రాణం. అమెరికాలో ఉన్నా ఆమె పద్మావతి కాలేజీనే కలవరించేవారు. ఇక్కడి విశేషాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. ఒక్కసారి అక్కడికి రావాలని ఉంది అని ఇటీవలే నాతో చెప్పారు. అది ఆమె ఆఖరి కోరిక. తీరకుండానే వెళ్లిపోయారు' అని ఆమె శిష్యురాలు ప్రేమావతి గుర్తు చేసుకున్నారు.

జలపాతాల సవ్వడి



తిరుమల కొండల్లో ..

రెండురోజులుగా కురిసిన వానలకు తిరుమల కొండల్లోంచి జాలువారుతున్న నీటి ధారలు.. భక్తులకు కనువిందుగా మారాయి. మొదటి ఘాట్ రోడ్డులో తిరుమల నుంచి తిరుపతికి ప్రయాణించేవారికి ఇవి కనిపిస్తాయి. అవ్వాచారికోన లోయ వెంబడి ఉన్న కొండలపై నుంచి జాలువారుతున్న నీటి ధారల్లో కాలినడక భక్తులు తడిచి ఆనందిస్తున్నారు. వాహనాల్లో ప్రయాణించేవారు ఈ అందాలను చూసి ముగ్ధులవుతున్నారు. తిరుపతి సమీపించే సమయంలో మాల్వాడిగుండం హోరు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జలపాత తుంపర్లు వానలా ప్రయాణీకులను తడుపుతున్నాయి. అలిపిరి దాటి దిగాక కపిలతీర్థం స్వాగతం పలుకుతోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి






వెయ్యిలింగాలకోనలో..

శ్రీకాళహస్తిలో పలుచోట్ల జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. వేడాంలోని వెయ్యిలింగాలకోన వద్ద కైలాసపర్వతాల నుంచి గంగమ్మ ఉధృతంగా కిందకు దూకుతూ చూపరులను అబ్బుర పరుస్తోంది. చిన్నమిట్టకండ్రిగ భైరవకోనలో కొండలనుంచి జలం కిందకు దూకుతోంది. కోనపై కొండల నుంచి గంగాజలం శివలింగాన్ని అభిషేకిస్తున్న దృశ్యాలను భక్తులు ఆసక్తికరంగా వీక్షిస్తున్నారు. శ్రీకాళహస్తి శివార్లలోని రాజీవ్‌నగర్ వద్ద హరహర తీర్థం జలపాతం వద్ద యువత స్నానాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





వెయ్యిలింగాలకోన - రాజీవ్‌నగర్ వద్ద హరహర తీర్థం

మురిసిన చెంచురాజుకండ్రిగ



స్వగ్రామంలోని గుకేష్ ఇంటి ముందు గ్రామస్తుల సంతోషం

పిచ్చాటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన యంగ్ ఇండియన్ సొంతూరు చెంచురాజుకండ్రిగ మురిసిపోయింది. స్థానికుల్లో ఆనందం వెల్లివిరిసింది. పిచ్చాటూరు మండలం చెంచురాజు కండ్రిగకు చెందిన ఈఎన్‌టీ సర్జన్ రజనీకాంత్, మైక్రో బయాలజిస్టు పద్మ దంపతులు చెన్నైలో స్థిరపడ్డారు. వీరి కుమారుడు గుకేష్ చిన్నప్పటి నుంచీ చలాకీగా ఉంటూ.. చదరంగంపై ఉన్న ఆసక్తితో 12 ఏళ్లకే గ్రాండ్ మాస్టర్‌గా చరిత్ర సృష్టించాడు. ఇప్పుడు వరల్డ్ చెస్ చాంపియన్ అయిన గుకేష్.. తమ గ్రామస్తుడు కావడం గర్వంగా ఉందంటూ స్థానికులు వారి ఇంటి ముందు సంబరాలు చేసుకున్నారు.

గుజరాత్‌లో గోడౌన్లపై టాస్క్‌ఫోర్స్ దాడి

● రూ.2 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు స్మగ్లర్లు కొత్తగా రూట్లు మారుస్తున్నారు. గతంలో బెంగళూరు, చెన్నై, వెస్ట్ బెంగాల్ మీదుగా స్మగ్లింగ్ జరిగేది. ఇప్పుడు గుజరాత్‌ను ఎంచుకున్నారు. ఈ క్రమంలో ఇక్కడి నుంచి వెళ్లిన టాస్క్‌ఫోర్సు పోలీసులు గుజరాత్ రాష్ట్రం పటాన్‌లో గోడౌన్లపై శుక్రవారం దాడి చేశారు. 4.5 టన్నుల బరువైన 155 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడికి అందిన సమాచారం మేరకు తిరుపతి టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ షరీఫ్ బృందం గుజరాత్ వెళ్లి పటాన్ పోలీసుల సహకారంతో దాడులు చేశారు. ఉత్తమ కుమార్, హన్సిరాజ్, పరదేశి ప్రధాన నిందితులుగా గుర్తించారు. పట్టుబడిన ఎర్రచందనం విలువ రెండు కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనాన్ని తిరుపతి టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు.

ఆ బడిలో ఒకే ఒక్కడు!

▸▸ మరో పాఠశాలలో ముగ్గురే విద్యార్థులు

▸▸ విశాఖ జిల్లాలోని ఏకోపాధ్యాయ బడుల దుస్థితి

పెదగంట్యాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అదో ప్రభుత్వ పాఠశాల.. విద్యార్థులు ఎంతమంది అనుకుంటున్నారా?.. ఒకే ఒక్కడు!! మరో పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులే!. ఇదీ విశాఖపట్నం జిల్లా పెదగంట్యాడ మండలం మరడ దాసరిపేట, మరుబాయి గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని పరిస్థితి. మరడ దాసరిపేట పాఠశాలలో అన్ని వసతులూ ఉన్నాయి. అయితే ఇక్కడ నాలుగో తరగతి చదువుతున్న ఒకే ఒక విద్యార్థి ఉన్నాడు. అలాగే మురుబాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులకు కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఇంకో చిన్నారిని వారం రోజులుగా అనధికారికంగా పాఠశాలకు వస్తోంది. ఆ చిన్నారితో కలుపుకొన్నా ఇక్కడ చదివేది నలుగురే!. ఈ రెండూ ఏకోపాధ్యాయ పాఠశాలలు. ఒకవేళ ఉపాధ్యాయులు రాకుంటే పాఠశాలకు సెలవే. దీంతో తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లకు పంపుతున్నారు.



మరడ దాసరిపేట పాఠశాలలో ఒకే విద్యార్థి



మరుబాయి పాఠశాలలో నలుగురు విద్యార్థులు

ఆసక్తి చూపని తల్లిదండ్రులు!

వాస్తవానికి మరడ దాసరిపేట, మరుబాయి గ్రామాల్లో 30 మందికి పైగా చిన్నారులు ఉంటారు. వీరిని స్థానికంగా ఉన్న పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ఎంతగానో ప్రయత్నించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకుగాను గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ రెండు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా కృషి చేస్తామని పెదగంట్యాడ ఎంఈవో శ్రీనివాసరావు చెప్పారు.

షార్‌లో వేగంగా గగన్‌యాన్ పనులు

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గగన్‌యాన్ ప్రయోగానికి శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. తొలుత మానవరహిత ప్రయోగం చేపట్టనున్నారు. ఒక రోబోను అంతరిక్షంలోకి పంపి సురక్షితంగా భూమిమీదకు తీసుకువస్తారు. ఈ ప్రయోగం జనవరిలో జరిగే అవకాశం ఉంది. ఇందుకోసం హెచ్‌ఎల్‌వీఎం3-జీ 1 రాకెట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ రాకెట్‌లో కీలకమైన దశలో వినియోగించే ఎస్200 సాలిడ్ మోటారు సెగ్మెంట్‌ను రాకెట్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌కు శుక్రవారం తరలించారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పచ్చజెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని దశల అనుసంధాన పనులు పూర్తయ్యాక రాకెట్ సంసిద్ధత సమావేశంలో ప్రయోగ తేదీని నిర్ణయిస్తారు.



ఎస్200 సాలిడ్ మోటారు సెగ్మెంట్



షార్ డైరెక్టర్ రాజరాజన్ జెండా ఊపడంతో అనుసంధాన భవనానికి తరలుతున్న హెచ్‌ఎల్‌వీఎం3-జీ 1 రాకెట్

కిరాయికి దిగి కిరాతకానికి ఒడిగట్టారు

▸▸ నేలకొండపల్లి దంపతుల హత్య కేసులో వీడిన మిస్టరీ

ఖమ్మం, డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన దంపతులను వారింట్లో కిరాయికి ఉంటున్న వ్యక్తులే చంపేశారు. దంపతులు డబ్బున్నవారని తెలిసి.. పథకం ప్రకారం అద్దెకు దిగి.. ఇంట్లోకి చొరబడి ప్రాణాలు తీసి, దొరికినంత దోచుకొని ఉడాయించారు! ఈ మేరకు నేలకొండపల్లిలో 17 రోజుల క్రితం జరిగిన దంపతులు యర్రా వెంకటరమణ (62), కృష్ణకుమారి (60) దంపతుల హత్య వెనుక మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆ వివరాలు.. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మోగులూరుకు చెందిన షేక్ అబిద్ అలియాస్ అబిద్ అలీ, సోహైల్, ఆరిఫ్ అనే వ్యక్తి బైసెక్సువల్! 2011లో కంచికచర్లలో జరిగిన ఓ హత్య కేసులో 2014లో జీవితఖైదు శిక్ష పడింది. అప్పటి నుంచి రాజమండ్రి సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న అతడు ఈ ఏడాది పెరోల్ మీద బయటకొచ్చాడు. గడువు ముగిసినా జైలుకు వెళ్లకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో కోదాడకు వెళ్లి పేరు మార్చుకున్నాడు. జల్సాలకు అలవాటుపడ్డ అబిద్.. నేలకొండపల్లిలోని బియ్యం వ్యాపారం చేసే యర్రా వెంకటరమణ(62) గురించి తెలుసుకున్నాడు. ఆయన డబ్బులు బాగా సంపాదించాడని, ఇంట్లో ఆయన, భార్య కృష్ణకుమారి(60) మాత్రమే ఉంటారని తెలుసుకున్నాడు. ఆ ఇంట్లో పలు పోర్షన్లు కిరాయికిస్తారని తెలుసుకున్న అబిద్... నవంబరు రెండో వారంలో ఆ ఇంట్లో అద్దెకు దిగాడు. అదును చూసి.. తన స్నేహితులతో కలిసి ఓనర్‌ఇంట్లోకి చొరబడ్డాడు. కృష్ణకుమారి, వెంకటరమణలను హత్యచేసి..వారి శరీరంపైఉన్న, ఇంట్లోని బంగారం,డబ్బుతో పారిపోయాడని పోలీసులు తెలిపారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ సోదాలు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల దుకాణాలు, గోదాముల్లో శుక్రవారం విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మిక సోదాలు జరిపారు. అధిక ధరలతోపాటు, లైసెన్సు లేకుండా ఎరువులు విక్రయించడం, తక్కువ తూకం వంటి లోపాలను గుర్తించాయి. రైతులను ఇబ్బందిపెడితే చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డైరెక్టర్ హరీష్‌కుమార్ గుప్తా హెచ్చరించారు.

విజయవాడ పశుసంవర్ధకశాఖ డివిజన్ ఏర్పాటు

అమరావతి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విజయవాడలో కొత్తగా పశుసంవర్ధకశాఖ డివిజన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కంకిపాడు కేంద్రంగా ఉన్న పశుసంవర్ధకశాఖ డివిజన్‌ను గన్నవరానికి మార్చింది. దీంతో ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ, నందిగామ, కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, గన్నవరం, గుడ్లవల్లేరులో డివిజన్లు ఏర్పాటయ్యాయి.

వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల బాంబు బెదిరింపు ఈ మెయిల్స్ ఆందోళన కలిగిస్తున్నాయి. హోటళ్లకు వరసగా ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే.తాజాగా శుక్రవారం మధ్యాహ్నం వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. కళాశాలలో బాంబులు ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. కళాశాల అధికారులు వెంటనే చంద్రగిరి డీఎస్పీకి, తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందుకు సమాచారమిచ్చారు. హుటాహుటిన బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లు రంగంలోకి దిగాయి. ప్రిన్సిపల్, డీన్, రెక్టార్ చాంబర్లు, పరిపాలనా భవనం, హాస్టల్ గదులు, పరిసరాలను తనిఖీ చేశారు. కళాశాలకు దాదాపు మూడు కిలోమీటర్ల పరిధిలో తనిఖీలు చేసి బాంబు బెదిరింపు మెయిల్ నకిలీవని నిర్ధారించారు. దీంతో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా, నెల రోజుల వ్యవధిలో తిరుపతిలోని దాదాపు ఐదారు స్టార్ హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. అప్పట్లోనూ తనిఖీలు చేసి బాంబులు లేవని నిర్ధారించారు. ఇప్పుడు వ్యవసాయ కళాశాలకు బెదిరింపు మెయిల్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.



చంద్రబాబు రైతు వ్యతిరేకి

- కలెక్టరేట్ వద్ద ఆందోళనలో వైసీపీ నేతలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ప్రతియేటా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం, దానిని తుంగలో తొక్కిందని ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. 'అన్నదాతకు అండగా' అనే పేరుతో వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ఆ పార్టీ నేతలు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు రైతు వ్యతిరేకి అన్నారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలంటూ వాగ్దానాలు చేసి ఆతర్వాత పట్టించుకోలేదని అన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వలేకే జగన్‌అధికారం కోల్పోయారని చెప్పారు. రైతుల పక్షాన పోరాటం చేస్తామంటూ, అవసరమైతే జైలుకు వెళతామన్నారు. మాజీ ఎమ్మెల్యే నారాయణస్వామి మాట్లాడుతూ చంద్రబాబు మోసకారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, తిరుపతి మేయర్ శిరీష, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి, నూకతోటి రాజేష్ పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో నరసింహులు వినతిపత్రం అందజేశారు.



రైతుల్లేని కార్యక్రమం

అన్నదాతలకు అండగా అంటూ వైసీపీ చేపట్టిన కార్యక్రమంలో రైతులు మాత్రం కనిపించలేదు. కాలేజీ విద్యార్థులను తరలించుకు వచ్చారు. పట్టణంలోని కొందరు మహిళలను కూడా ఎన్నికల సమయంలో తరలించినట్లుగా తీసుకువచ్చి నిలబెట్టారు. ఎందుకు ఈ నిరసన కార్యక్రమం అని అడిగితే, చాలా మంది చెప్పలేకపోయారు. తమను తీసుకువస్తే వచ్చామని చెప్పారు.

పలువురు ఇన్‌ఛార్జులు డుమ్మా

భారీ కార్యక్రమం అంటూ పిలుపు ఇచ్చినా తిరుపతి జిల్లాలో పలు నియోజకవర్గాలకు చెందిన వైసీపీ ఇన్‌ఛార్జిలు ఈ నిరసన కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. మాజీ మంత్రి రోజా, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేట సంజీవయ్య, గూడూరు నుంచి మేరుగ మురళి ధర్నాకు రాలేదు. కార్యకర్తలు కూడా పలుచగా కనిపించారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా పాల్గొనలేదు. పార్లమెంటు సమావేశాల కారణంగా తిరుపతి ఎంపీ గురుమూర్తి హాజరవలేదు.

రేపు కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ రాక

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం జిల్లాకు విచ్చేస్తున్నారు. ఉదయం ఢిల్లీ నుంచి విమానంలో బయలుదేరి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. 10 గంటలకు ఆర్‌సీపురం మండలం రామాపురం వద్ద ఉన్న సిద్ధేశ్వర బ్రహ్మర్షి ఆశ్రమాన్ని సందర్శిస్తారు. అక్కడి నుంచి పద్మావతి అతిథిగృహానికి వచ్చి విశ్రాంతి తీసుకుంటారు. 3 గంటలకు చేనేత శాఖ రీజనల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని రాత్రికి పద్మావతి అతిథిగృహానికి చేరుకుంటారు. సోమవారం వేకువజామున 3 గంటలకు సిద్ధేశ్వర బ్రహ్మర్షి ఆశ్రమం చేరుకుని అక్కడి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉదయం 7 గంటలకు తిరుపతి విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరుతారు.

బీఎన్‌కండ్రిగలో 169.8మి.మీ వర్షపాతం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిజిల్లాలో శుక్రవారం ఉదయం వరకు నమోదు వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. బీఎన్ కండ్రిగ 169.2మి.మీ. కేవీబీపురం 167.6, వడమాలపేట 144.2 సూళ్ళూరుపేట 143, డక్కిలి 136.8, వరదయ్యపాళెం 122.4, బాలయపల్లి 119.8, తడ 115.6, పుత్తూరు 114.8, నారాయణవనం 109.2మి.మీ. వర్షపాతం నమోదు అయింది.

స్విమ్స్‌కు రూ. 10,00,100 విరాళం

తిరుపతి(వైద్యం), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పేద రోగులకు వైద్య సేవలు అందిస్తున్న శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఫిలిమ్ డిస్ట్రిబ్యూటర్ కె.వెంకటేశ్వరరావు రూ.10,00,100 విరాళం అందించారు. స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్‌ను శుక్రవారం ఆయన ఛాంబర్‌లో కలిసి ఈ మేరకు చెక్కును అందజేశారు. దాతలకు స్విమ్స్ యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

పుత్తూరు వార్తలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పుత్తూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పరిధిలోని సబ్‌స్టేషన్లలో మరమ్మతులు, లైన్ల మీద పడిన చెట్ల కొమ్మల కత్తిరింపు వంటి పనుల కారణంగా 14వ తేదీ శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని ఏఈ జయసాయి తెలిపారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

● సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పుత్తూరు కోర్టు పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కేసుల పరిష్కారం కోసం మూడు బెంచ్‌లు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. శుక్రవారం సమావేశం నిర్వహించి మీడియాకు తెలియజేశారు. జాతీయ లోక్ అదాలత్‌లో ప్రిసైడింగ్ అధికారులుగా తనతో పాటు జూనియర్ సివిల్ జడ్జి జానకి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాల్ కృష్ణ వ్యవహరిస్తామని తెలిపారు. అన్ని రకాల సివిల్, చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు అంతిమమని వెల్లడించారు. తీర్పుపై అప్పీళ్లు ఉండవన్నారు.

ఎస్టీపీ ప్లాంట్లకు స్థల పరిశీలన

పుత్తూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు చెరువుల వద్ద నీటిని శుద్ధి చేసే ప్లాంట్ల(ఎస్టీపీ) కోసం శుక్రవారం ఆర్డీవో రామ్మోహన్ స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన పుత్తూరు, గోవిందపాళెం, నేసనూరు చెరువుల వద్ద స్థలాలను పరిశీలించారు. డీటీ అశోక్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నిండిన చెరువులు

పుత్తూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని మూడు చెరువులు మినహా మిగిలిన 31 చెరువులు పూర్తిగా నిండి కలుజులు పారుతున్నాయని ఇరిగేషన్ ఏఈ పరశురామ్ నాయక్ తెలిపారు. ఇప్పటి వరకు కేబీఆర్‌పురం, రామసముద్రం, చెర్లోపల్లి చెరువులు నిండలేదన్నారు.

వేపగుంట-అక్కేరి రోడ్డుకు రైల్వే శాఖ అభ్యంతరం



పుత్తూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపగుంట - అక్కేరి గ్రామాల మట్టి రోడ్డును సిమెంటు రోడ్డు మార్పు చేయడానికి రైల్వే శాఖ అధికారులు అభ్యంతరం చెబుతున్నారని వేపగుంట గ్రామస్తులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు మేరకు అధికారులు పరిశీలించారు. శుక్రవారం వేపగుంట, ఉత్తరపు కండ్రిగలలో సదస్సులు జరిగాయి. రైల్వే పీడబ్ల్యూడీ శాఖ అధికారులతో ఎంపీడీవో చర్చించి కనీసం మెటల్ రోడ్డును నిర్మించేందుకు అనుమతులు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు సూచించారు. ఇక సదస్సుల్లో ఇళ్ల పట్టాల కోసం 4 వినతులు, ఆర్ఓఆర్ కోసం 23, ఎఫ్‌లైన్‌కు 4 వినతులు అందాయి. ఆర్ఐ తిరుమలసాయి, సర్వేయరు శేషమరాజు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో నిలిచిన వర్షం నీరు



పుత్తూరు టౌన్, డిసెంబర్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల వర్షం నీటితో నిండిపోయింది. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో సిబ్బంది నీటిని తోడి బయట పోస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు

వడమాలపేట, డిసెంబర్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో 11 చెరవుల సాగునీటి సంఘాల ఎన్నికలకు సబంధించి సన్నాహాలు పూర్తి చేసినట్లు ఇరిగేషన్ ఏఈ మురళీమోహన్ చెప్పారు. ఎన్నికల అధికారుల నియమాకం పూర్తియిందని, ఆయా చెరువుల ఎన్నికలు గ్రామ సచివాలయాలు, పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం 7 నుంచి 1 గంట వరకు పూడి, కదిరిమంగళం, పాదిరేడు, పిడతల కోన చెరువు, టీసీ అగ్రహారం, తిరుమణ్యం చెరువుల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8వరకు పత్తి పుత్తూరు, కాయం, వెదళ్ల చెరువు, కల్లూరు, తట్నేరి చెరువు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెదళ్ల చెరువు ఎన్నికలు వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో, తట్నేరి చెరువు ఎన్నికలు లక్ష్మమ్మ కండ్రిగలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మార్పులకు అవకాశం

వడమాలపేట, డిసెంబర్ 13(ఆంధ్రజ్యోతి):భవిష్యత్తుకు భరోసాగా భూ సర్వేలో మార్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. శుక్రవారం పాదిరేడు రెవెన్యూకు సంబంధించి లక్ష్మమ్మకండ్రిగలో సదస్సు నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇబ్బందులకు గురైన రైతులు, ఇతర సమస్యలపై ప్రభుత్వం గ్రామాలకే అధికార యంత్రాంగం వచ్చేలా సదస్సులు నిర్వహిస్తోందన్నారు. సదస్సులో తహసీల్దార్ జరీనా, టీడీపీ నాయకులు ఉదయ్‌యాదవ్, వెంకటయ్య, హేమావతి, సుబ్రమణ్యం నాయుడు, పురుషోత్తం నాయుడు, మణినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాకపోకలకు అంతరాయం

నారాయణవనం, డిసెంబర్ 13(ఆంధ్రజ్యోతి): వర్షాలకు మండలంలో పలు చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. అలాగే కాజ్‌వేలపై నీరు తగ్గకపోవడంతో ఆయా గ్రామాల నుంచి రాకపోకలు సాగించడానికి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. తిరువట్యం వద్ద అరుణానది కాజ్‌వేపై నీరు ఉధృతంగా పొంగిపారుతోంది. వేరుశనగ పంట నీట మునగడంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెరుచుకోని మల్లిమడుగు డ్యాం సైఫన్లు

● తొమ్మిది గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

● గత ఐదేళ్లలో మరమ్మతులు చేయని ఫలితం ఇదీ



రేణిగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండ్రోజులుగా కురిసిన వర్షాలతో మల్లిమడుగు డ్యాం జలకళ సంతరించుకుంది. అయితే ఆటోమేటిక్ సైఫన్లు తెరుచుకోకపోవడంతో తొమ్మిది గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడదల చేయాల్సి వచ్చింది. ఐదేళ్లలో సైఫన్‌కు నిర్వహణ మరమ్మతులు చేయకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మల్లిమడుగు డ్యాంకు ఎంతో ఘన చరిత్ర ఉంది. 1954లో అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఈ డ్యాం నిర్మాణానికి పునాదిరాయి వేసి జాతికి అంకితం చేశారు. తర్వాత 1955లో ప్రారంభమైన డ్యాం పనులు 1959 డిసెంబరు 31వ తేదీకి పనులు పూర్తి చేసుకుని అందుబాటులోకి వచ్చింది. డ్యాం నిర్మాణంలో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి ఎక్కడా లేనివిధంగా 40 సైఫన్లు ఏర్పాటు చేశారు. డ్యాం నిండితే ఈ సైఫన్లు ఆటోమేటిక్‌గా తెరుచుకుని నీరు బయటకు వెళ్లేలా రూపొందించారు. ఇలా 64ఏళ్లు ఎటువంటి అంతరాయం లేకుండా పనిచేసింది. పురాతనమైన ఈ డ్యాం నిర్వహణను వైసీపీ ప్రభ్వుత్వ హయాంలో ఐదేళ్లు పట్టించుకోలేదు. మెయిన్‌టెన్స్‌కు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందకు రాకపోవడానికి పనులు చేస్తే బిల్లులు ఇస్తారో లేదో అనుమానమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యం మల్లిమడుగు డ్యాంకు శాపంగా మారింది. మొత్తం 40 సైఫన్లలో రెండు మినహా 38 సైఫన్లు తెరుచోకవడం లేదు. ఫలితంగా డ్యామ్ పరిస్థితిని సమీక్షించిన అధికారులు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా ఎడమ వైపున నాలుగు గేట్లు ఒక అడుగు మేర, మధ్యలో ఐదు గేట్లు మూడు అడుగుల మేరకు ఎత్తి దిగువకు విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గూడూరులోని ఎస్పీఎస్ అప్పర్ ప్రైమరీ ఎయిడెడ్ స్కూల్లో ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ తెలిపారు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టు-1, తెలుగు లాంగ్వేజ్ పండిట్-1, హిందీ లాంగ్వేజ్ పోస్టు-1 డైరెక్ట్ నియామకం ద్వారా భర్తీ చేసేందుకు పాఠశాల కరస్పాండెంట్ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశారని, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. https://cse.ap.gov.in/AidedRecruitment లింక్ ద్వారా ఆన్‌లైన్‌లోగాని, పాఠశాల కరస్పాండెంట్ వద్దగాని దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

20న చేపల చెరువుల వేలం

వెంకటగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 7 చెరువుల్లో చేపల పెంపకానికి ఈనెల 20వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అమ్మవారిపేట, కుమ్మరగుంట, చెవిరెడ్డిపల్లి, ధర్మాపురం, పెరియవరం, మారటపల్లి, పోలిశెట్టి గుంట, మనులాల పేట చెరువుల్లో చేపల పెంపకానికి వేలం నిర్వహిస్తామన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులకు...

వెంకటగిరి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బందిలదొడ్డి వీధిలో ఉన్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న 1,2,4,6,8,9,10,11,12,13,14,15,16 గదులను నెలసరి అద్దెకు లీజుకు ఇచ్చేందుకు ఈనెల 20వ తేదీన 3గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ శ్రీధర్ తెలిపారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సూళ్లూరుపేటను ముంచిన కాళంగి

జాతీయ రహదారిపైకి చేరిన వరదనీరు ● జలదిగ్బంధంలో వట్రపాలెం





చెరువును తలిపిస్తున్న వట్రపాలెం - జాతీయ రహదారిపై చేరిన వరదనీటిలో నెమ్మదిగా వెళుతున్న వాహనాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో పట్టణ పరిసర ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కాళంగి నదికి భారీగా వరదనీరు చేరడంతో నది పరివాహక ప్రాంతమైన వట్రపాలెం జలదిబ్బంధంలో చిక్కుకొంది. ఇళ్లను వరదనీరు చుట్టుముట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులను వట్రపాలెం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అదేవిధంగా మన్నారుపోలూరు రోడ్డు మోకాటి లోతు నీరుచేరడంతో రాకపోకలు స్తంభించాయి. కాళంగి ఉధృతికి ఆర్టీసీ డిపో సమీపంలో గోకులకృష్ణ కళాశాల వద్ద జాతీయ రహదారిపైకి భారీగా వరదనీరు చేరింది. పోలీసులు, హైవే సిబ్బంది అక్కడకు చేరుకొని భారీగేట్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నెమ్మదిగా సాగించారు. వరదనీరు పెరగుతుండడంతో ఎక్స్‌కవేటర్లతో కళాశాల రోడ్డుకు గండికొట్టి నీటిని అటువైపు మళ్లించారు. మధ్యాహ్నం వరకు జాతీయ రహదారిపై వరదనీరు పారుతుండడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. శ్రీసిటీ, మాంబట్టు పరిశ్రమలకు నైట్ డ్యూటీలకు వెళ్లిన కార్మికులు శుక్రవారం ఉదయం మన్నారుపోలూరుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సాయంత్రం 4 గంటలకు వరద ఉధృతి తగ్గడంతో మోటారు సైకిళ్లు, ఇతర వాహనాల్లో గమ్యానికి చేరారు. కాళంగికి ఒక్కసారిగా వరదనీరు రావడంతో పరిసర ప్రాంతాలే కాకుండా మన్నారుపోలూరు, పడమటి కండ్రిగ, ఎన్పీ కండ్రిగ, గోపాల్ రెడ్డిపాలెం ప్రాంతాల్లో వరిపైర్లు నీటి మునిగాయి. చెంగాళమ్మ ఆలయ సమీపంలో కాళంగి నది పక్కనే ఉన్న గోశాల ప్రాంతమంతా వరదనీటిలో మునిగింది. వారం వ్యవధిలోనే మరోసారి సూళ్లూరుపేటను వరదనీరు ముంచెత్తడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జాతీయ రహదారిపై చేరిన వరదనీటిని, వట్రపాలెం ప్రాంతాలను ఆర్డీవో కిరణ్మయి అధికారులతో కలిసి పరిశీలించి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులతో మాట్లాడి కమిషనర్ చిన్నయ్యను అధికారులకు పలు సూచనలు చేశారు.

అన్నదాతలకు భారీ నష్టం

● నీట మునిగిన వందలాది ఎకరాలు

● పులికాట్ పోటుతో నీళ్లల్లోనే పొలాలు





ఉధృతంగా ప్రవహిస్తున్న పాములకాలువ - చేనిగుంటలో దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో గురువారం కురిసిన భారీ వర్షం రైతులకు భారీ నష్టం చేకూర్చింది. కాదలూరు, వెండ్లూరుపాడు, కటవ, మాంబట్టు, గ్రద్దగుంట, చేనిగుంట, వాటంబేడు, కారిజాత గ్రామాల్లో పంటపొలాలను వరదనీరు ముంచెత్తగా వేనాడు, ఇరకందీవుల్లోని పంట పొలాలు ఉప్పునీటితో నిండిపోయాయి. వందల ఎకరాల్లో పొట్టదశలో ఉన్న వరిపంట పాచిపోయే పరిస్థితి నెలకొంది. సుమారు 2500 నుంచి 3వేల ఎకరాల వరకు వరి పంటకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా. మరో వైపు ఇరకం దీవిలో ఐదు పూరిగుడిసెలు ధ్వంసమయ్యాయి. పాములకాలువ ఉప్పొంగడంతో కాదలూరు, వెండ్లూరుపాడు, కట్టవగ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సాధారణ రోజుల్లో వర్షం ఆగిపోయిన 3, 4 గంటల్లోనే వరద నీరంతా పులికాట్ సరస్సులోకి వెళ్లిపోయేది. అయితే పౌర్ణమి సమీపించడంతో సముద్రంలో ఆటుపోట్లు కారణంగా పులికాట్ సరస్సులో సముద్రపునీరు భారీగా చేరి పోటుమీద ఉంది. తద్వారా వరదనీరు పులికాట్‌లోకి వెళ్లేందుకు సమయం పట్టనుంది. దీంతో నీళ్లన్నీ పొలాల్లో నుంచి వెళ్లేందుకు మరో రెండు రోజులు పట్టే ట్టే అవకాశం ఉంది. కాగా, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ట్రాక్టర్‌లో వెళ్లి చేనిగుంటలో నీటమునిగిన పంట పొలాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతులకు ధైర్యం చెప్పారు. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారని, రైతులను ఆదుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దారు శరత్‌బాబు, టీడీపీ నాయకులు పార్థసారథి, కామిరెడ్డి మురళీరెడ్డి, బొమ్మన పళణి తదితరులు ఉన్నారు.

గంగ కాలువను తడ వరకు పొడించండి

తడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏటా కురిసే వర్షాలకు పంట పొలాలన్నీ మునిగిపోయి నష్టపోతున్నామని పలువురు రైతులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకువచ్చారు. శుక్రవారం తడకు వచ్చిన ఆమె గ్రద్దగుంట, చేనిగుంట, కాదలూరులోని పంట పొలాలను పరిశీలించారు. గ్రద్ద గుంటలో రైతులు మాట్లాడుతూ తాము వర్షాధారంతోనే పంటలను పండిస్తు న్నామని, ఆ వర్షమే తరచూ తమను నష్టాలపాలు చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలతో చేతికి వచ్చే పంట నీళ్లపాలవుతోందని చెప్పుకొచ్చారు. తెలుగుగంగ-శిబి కాలువ తడ వరకు పొడిగిస్తే ఆ నీళ్లతో చెరువులన్నీ నిండి సాగుకు ఇబ్బందులు ఉండవని వివరించారు. తెలుగు గంగ-శిబి కాలువ వరదయపాళెం మండలం కళత్తూరు వరకే ఉందని, అక్కడి నుంచి తడ వరకు తీసుకువచ్చేందుకు 2017లో అప్పటి ప్రభుత్వం ప్రయత్నించినా అటవీశాఖ అడ్డంకులతో పనులు ఆలస్యమయ్యాయన్నారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆ కాలువ నిర్మాణానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి గంగ కాలువల నిర్మాణానికి కృషి చేస్తానని విజయశ్రీ తెలిపారు.

పరవళ్లు తొక్కుతున్న స్వర్ణముఖి, చల్లకాలువ

ప్రమాదపుటంచున ఐదు గ్రామాలు



కోట మండలం దైవాలదిబ్బ వద్ద ప్రమాదకరంగా ఉన్న స్వర్ణముఖి పొర్లుకట్టలను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఇరిగేషన్ అధికారులు

కోట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల వచ్చిన వర్షానికి పలు గ్రామాల్లో వరిపైర్లు నీటమునగగా, చెరువులు నిండుకుండల్లా మారాయి. తిరుపతిలోని కల్యాణిడ్యామ్ గేట్లు ఎత్తివేసి స్వర్ణముఖినదిలోకి వరదనీరు వదలడంతో శుక్రవారం కోట మండలం గూడలి, తిన్నెలపూడి గ్రామాల వద్ద స్వర్ణముఖి, మామిడికాలువ నదులు వరదనీటితో పరవళ్లు తొక్కాయి. గూడలి వద్ద స్వర్ణముఖినదిలో బ్రిడ్జి మీద ప్రయాణం చేయకుండా పోలీసులు వాహనాలను నిలిపివేయడంతో కోట, నాయుడుపేట మార్గాల్లో వాహనాలు రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. స్వర్ణముఖినది పరవళ్లు తొక్కుతుండటంతో ప్రమాదపు అంచున ఉన్న పుచ్చలపల్లి, దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ గ్రామాల సమీపంలో ఉన్న వాకాడు మండలం గంగన్నపాళెం గ్రామానికి ప్రమాదం పొంచి ఉంది. తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, వీఆర్వో కృష్ణయ్య ఆధ్వర్యంలో స్వర్ణముఖి నది పొర్లుకట్టలకు తాత్కలిక మరమ్మతులు చేయడానికి రైతుల సాయంతో రింగ్‌బండ్‌లు వేస్తున్నారు. చల్లకాలువ, స్వర్ణముఖి పరవళ్లు తొక్కుతుండటంతో కర్లపూడి, చనుములుదిబ్బ గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. బకింగ్‌హామ్ కెనాల్ పొంగడం వల్ల గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామానికి దారి సౌకర్యం లేకపోవడంతో మత్స్యకారులు పడవల ద్వారా గోవిందపల్లికి వచ్చి నిత్యావసర సరుకులు తీసుకువెళ్తున్నారు.

పొంగిన వాగులు, వంకలు

నీట మునిగిన పంట పొలాలు



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురిసిన భారీ వర్షం, కాళంగి నది ఉగ్రరూపంతో సూళ్లూరుపేటలోని నెర్రికాలువ, పుచ్చాకాలువ, పాముల కాలువ పొంగి ప్రవహించాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న నెర్రికాలువ ఉధృతంగా ప్రవహించడంతో పరమేశ్వరి నగర్ సమీపంలో శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో రోడ్డుపై నీరుచేరి వాహన రాకపోకలకు ఇబ్బదులు తలెత్తాయి. అదేవిధంగా కోటపోలూరు రైల్వేగేటు అండర్ బ్రిడ్జి సమీపంలో ఉన్న పుచ్చాకాలువ ప్రవాహానికి కోటపోలూరుకు వెళ్లే రహదారిపై భారీగా నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో దాదాపు 3500 ఎకరాలకు పైగా పంట పొలాలు నీటమునిగాయి. అదేవిధంగా మంగళంపాడు, ఇలుపూరు, ఉగ్గుముడి గ్రామాలతో పాటు పడమటి పల్లెల్లో మిరపపంట నీటిపాలయ్యాయి. ఆర్డీవో కిరణ్మయి అధికారులతో కలిసి ముంపు ప్రాంతాలతో పాటు నీట మునిగిన పొలాలను పరిశీలించారు.

బాలాంజనేయస్వామి ఆలయంలో సిందూర పూజలు

సూళ్లూరుపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక హనుమత్ వ్రత పూజల్లో భాగంగా సిందూర పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని హనుమంతుడి ఉత్సవమూర్తిన్ని కొలువుదీర్చి పుష్పాలతో అలంకరించారు. యాగశాల మండపంలో హోమం నిర్వహించి సామూహిక సిందూర పూజలు చేశారు. ఉభయ కర్తలుగా మోదుకూరి ప్రియవర్ధన్, లావణ్య దంపతులు వ్యవహరించారు.

లైసెన్స్ లేని వాహనాల సీజ్

కోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, గూడలి, చిట్టేడు, కోట ప్రాంతాల్లో ఉప రవాణాఅధికారి శాంతి శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్, పర్మిట్ లేకుండా తిరుగుతున్న ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

కార్తీక దీపోత్సవం

కోట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోట సమీపంలో గల కొక్కుపాడు రోడ్డు వద్ద ఉన్న బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి కార్తీక దీపోత్సవం జరిగింది. మహాన్యాశ పూర్వక సంపూర్ణ ఏకాదశ రుద్రాభిషేకాన్ని పురస్కరించుకొని బాలసుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు జరిగాయి. తమిళనాడుకు చెందిన పలువురు భక్తులు అరుణాచలంలో కార్తీకదీప మహోత్సవం జరుపుకునే సమయానికి ఇక్కడ కార్తీకదీపాన్ని వెలిగించారు.

15న సామూహిక సత్యనారాయణ వ్రతం

నాయుడుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట అగ్రహారపేటలోని సాయిబాబా మందిరంలో ఈనెల 15వ తేదీ ఆదివారం దత్తజయంతి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు.

16, 17 తేదీల్లో సర్పంచులకు శిక్షణ తరగతులు

ఓజిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలకు ఈనెల 16, 17 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు శిక్షణ తరగతులకు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

రెండో రోజూ ఎల్ఎస్‌డీజీ శిక్షణ

సూళ్లూరుపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెండోరోజు ఎల్ఎస్‌డీజీపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ప్రమీలారాణి ఆధ్వర్యంలో పంచాయతీల్లో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, అభివృద్ధి పనుల గురించి పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో పాటు ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవాని, ఎంఈవో శ్రీనివాసులు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు, ఏపీవో నాగరాజు సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు

గూడూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతోందని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, అల్లూరు కరుణాకర్‌రెడ్డి, హేమకుమార్‌రెడ్డి, శివకుమార్, సర్వేయర్ విశ్వనాథం, వీఆర్‌వో పాల్గొన్నారు.

పెళ్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని పునబాక గ్రామంలో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహిం చారు. ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వో సుధాకర్, సర్వేయర్ పూజిత, టీడీపీ సీనియర్ నాయకులు వేలూరు హరినాయుడు, మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, దామెర ప్రసాద్‌నాయుడు, మురళీ నాయుడు, రవినాయుడు, తాళ్ల యుగందర్‌గౌడ్, పునబాక పోలయ్య, యాగాన్ని బెన్నీ, తాళ్ల రెడ్డిశ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో డిప్యూటీ తహసీల్దారు అజమతుల్లాఖాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధులత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. టీడీపీ జిల్లా కార్యదర్శి వాకా విజయ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్వేయర్ గోపీరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, వీఆర్వో సాయిశరణ్య పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాశాస్త్రివారి కండ్రిగ, సుంకరవారిపల్లెలో తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ సదస్సులో వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తహసీల్దార్ చెప్పారు.

డక్కిలి(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగోడు సచివాలయంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించాలంటూ ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని చెప్పారు. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి సమస్య పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజగోపాల్, రెవెన్యూ సిబ్బంది పావని తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి) మండలంలోని వెంగమాంబపురం, అక్కముద్రం గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 21, పక్కాగృహాల కోసం 5, సాగుభూమికి హక్కులు కల్పించాలని ఒకటి, సర్వే కోసం మూడు అర్జీలు అందాయని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య, ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం భట్లకనుపూరులో శుక్రవారం తహసీల్దారు పద్మావతి అధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు తమ భూ సమస్యలపై అర్జీలు అందజేశారు.

పంబలేరుకు పోటెత్తిన వరద

చప్టాపై నిలిచిన రాకపోకలు



పంబలేరు చప్టాపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

గూడూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా గూడూరు మండలంలోని గురువారం భారీ వర్షం కురిసింది. పైప్రాంతాల్లో నుంచి వరద నీరు రావడంతో పంబలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చప్టాపై మూడు అడుగుల లోతు వరకు వరద నీరు ప్రవహిస్తుండడంతో రూరల్ ఎస్ఐ. మనోజ్ కుమార్ రాకపోకలను నిలిపివేశారు. అదే విధంగా మండల పరిధిలోని విందూరులో పైప్రాంతం నుంచి వరద నీరు ప్రవహించడంతో గ్రామ సమీపంలో లోతట్టు ప్రాంతాల మార్గం, వేమలపాళెం సమీపంలోని చప్టాపై వరద నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

నీట మునిగిన వరి



భీమవరంలో నీటమునిగిన వరి పొలాల వద్ద రైతులు

పెళ్లకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రాత్రి నుంచి శుక్రవారం రాత్రి వరకు కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖినదితో పాటు వాగులు, కాలువల్లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. గత నెలలో కురిసిన వర్షాలకు భీమవరం, టెంకాయతోపు, చిల్లకూరు, పెళకూరు, చావాలి గ్రామాల్లో వరినాట్లు నీటమునిగాయి. ప్రస్తుత వర్షాలతో మళ్లీ పంటలు నీటమునగడంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు డీలాపడుతున్నారు. ఇక మండలంలోని అన్ని చెరువులు నిండుకుండల్లా మారాయి.

స్వర్ణముఖినది చప్టాపై ఆగిన రాకపోకలు

పెళ్లకూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు - పుల్లూరు గ్రామాలకు వెళ్లే రహదారిలో ఉన్న స్వర్ణముఖినది రిజర్వాయర్ చప్టాపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఐదు మండలాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరద పూర్తిగా తగ్గే వరకు చెక్‌డ్యామ్, లోలెవల్ కాజ్‌వేలు, వాగుల మీదుగా రాకపోకలు సాగించవద్దని ఎస్ఐ నాగరాజు సూచించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వైభవంగా ప్రదోష పూజలు


నందీశ్వరుడికి అభిషేకం

నాగలాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో త్రయోదశి పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ అభిషేకాలు చేసి విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. తదనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరణ చేపట్టి మంగళ వాయిద్యాల నడుమ నక్షత్ర, కుంభ, మహా హారతులు చేపట్టారు. హారతి అనంతరం ఉత్సవమూర్తులైన సర్వ మంగళా దేవి సమేత వాల్మీకేశ్వర స్వామిని దివ్యాంగ సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


భానుతేజ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి పట్టణం కొండమిట్టకు చెందిన రామయ్య ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి విరమణ పొందాడు. ఆయన పెద్దకుమారుడు భానుతేజ(36) బీటెక్ పూర్తి చేసి ప్రైవేటు సంస్థలో పని చేస్తుండేవాడు. ఇటీవల ఓ యువతితో ఫిబ్రవరిలో వివాహం జరిగేలా కుటుంబ పెద్దలు నిశ్చయించారు. గత యేడాది డిసెంబరులో భానుతేజ తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపంతో ఉద్యోగానికి కూడా దూరమయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ సమీపంలోని ఊరందూరు గేటు వద్ద రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు మృత దేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 15మందికి జరిమానా

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15మందికి జరిమానా విధించినట్లు శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పట్టణవ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 15మందిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. అదే విధంగా బహిరంగ మద్యపానం స్థావరాలపై దాడులు చేశారు. 25మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. వీరికి కోర్టులో ఒక్కొక్కరికి రూ.500చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...
మహారాష్ట్రవాసి దుర్మరణం

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని మహారాష్ట్రవాసి దుర్మరణం చెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో జరిగింది. మహారాష్ట్రకు చెందిన లంకేష్(40) లారీతో రాచగున్నేరిలోని ప్రైవేటు కర్మాగారానికి వచ్చాడు. లారీని పరిశ్రమలో పెట్టి భోజనం కోసం వెలుపలికి వచ్చాడు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో లంకేష్ దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారంతో శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలను నమోదు చేసుకున్నారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జాతీయ రహదారిపై ఇరువైపులా జిల్లాలో ఉండే పోలీస్‌స్టేషన్లలను అప్రమత్తం చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా రోడ్డు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

వెదళ్లచెరువు ఎస్టీ కాలనీలో కలెక్టర్


ఎస్టీకాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరద ముంపు నుంచి వెదళ్లచెరువు ఎస్టీ కాలనీ రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆ మేరకు శుక్రవారం ఆ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లిమడుగు రిజర్వాయరు నుంచి రాళ్లకాలువ ద్వారా నీరు ప్రవహిస్తోందన్నారు. రాళ్లకాలువ అనుకుని ఈ కాలనీ ఉండడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి వరదలు వచ్చినా ముంపునకు గురికాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆ మేరకు అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే ఇక్కడి చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. శ్రీకాళహస్తి ఇరిగేషన్ ఈఈ మదన్‌గోపాల్, తహసీల్దారు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్‌పై వర్క్‌షాప్


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మిద్దెల హరి తదితరులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుగున్నేరి సమీపంలోని స్కిమ్స్ కళాశాలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్, కోటక్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని కరస్పాండెంట్ మిద్దెల హరి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మ్యూచవల్ ఫండ్స్ ప్రైమరీ, సెకండరీ మార్కెట్లు, ఇంపార్టెన్స్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్, ఫైనాన్షియల్ ఆపర్చునిటీస్, కెరీర్ ఇన్ సెక్యూరిటీస్ మార్కెట్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, ఎన్ఐఎస్ఎం ట్రైనర్ డాక్టర్ బి.నాగార్జున, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో వసతులపై ఎమ్మెల్యే ఆరా


రైల్వే అధికారులతో మాట్లాడతున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో వసతులపై ఎమ్మెల్యే సుధీర్ ఆరా తీశారు. శుక్రవారం ఆయన రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల కావాల్సిన సదుపాయాలు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా రైల్వే స్టేషన్ అభివృద్ధికి కేంద్రప్రభుత్వ సహకారంతో నిధులు మంజూరు చేయిస్తామన్నారు. శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ మరింతగా అభివృద్ధి చేయాలని ఆయన రైల్వే అధికారులను కోరారు. ఆయనను రైల్వే అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచండి


మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో శుక్రవారం మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. పట్టణంలో పారిశుధ్యం, చేపట్టబోయే పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కాలువల్లో మురుగు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ పరిధిలో వీధిదీపాల సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గిరికుమార్ పాల్గొన్నారు.

ఎంపీడీవోపై విచారణ హర్షణీయం
సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండల ఎంపీడీవో రఫిఖాన్ అవినీతిపై విచారణ చేపట్టడం హర్షణీయమని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో విచారణ అధికారి రెడ్డెప్పను కలిశారు. ఈ కార్యక్రమంలో మించల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదు. 33/11 కేవీ సబ్‌స్టేషన్, 11 కేవీ లైన్ల నెలవారీ మరమ్మతుల కారణంగా ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, మండలం, కేవీబీపురం, బీఎన్‌కండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.



ఉధృతంగానే స్వర్ణమ్మ

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో స్వర్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజుల పాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో స్వర్ణముఖి నదికి నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. ముక్కంటి ఆలయం వద్ద పవిత్ర స్వర్ణముఖి నది నిండుగా ప్రవహిస్తున్న సుందర రూపాన్ని ప్రజలు ఆసక్తిగా వీక్షించేందుకు విచ్చేస్తున్నారు.

ఇంకా జలదిగ్బంధంలోనే...




బీఎన్‌కండ్రిగలో నీటిలోనే ఉన్న మిరప పంట - పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన వద్ద , వరదయ్యపాళెంలో నీటి ఉధృతి

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జలదిగ్బంధంలో చిక్కుకున్న అమ్మపాళెం సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. శుక్రవారం తమ గ్రామంలో ఇళ్ల మధ్య నీరు స్తంభించిపోవడంపై నిరసన వ్యక్తం చేస్తూ ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దిగువున చుక్కల నిడిగల్లు చెరువు నిండి కలుజు పారింది. అయితే కొందరు కలుజు నుంచి నీరు ప్రవహించకుండా ఇసుక బస్తాలను అడ్డుగా వేశారు. దీంతో అమ్మపాళెంలోకి చెరువు నీరు చేరింది. ఇలాగే కొనసాగితే శనివారం ఇళ్లల్లోకి నీరు చేరుతుందని ఇకనైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని అమ్మపాళెంవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు వరి, మిరప పంటలు నీటిలోనే ఉన్నాయి. ఈ రెండు నెలల్లో వరుస తుఫాన్ల కారణంగా పంటలు నీట మునగడంతో రెండు దఫాలుగా వరి నాటామన్నారు. ప్రస్తుతం వచ్చిన భారీ వర్షంతో వరి, మిరప పొలాల్లో నీరు నిలిచిపోవడంతో పంట మళ్లీ దెబ్బతినే అవకాశాలు ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక వర్షాలకు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సూళ్లూరుపేటకు వెళ్లే రహదారిలో మన్నారుపోలూరు దగ్గర నీరు ఉధృతంగా పారుతుండడంతో రాకపోలు నిలిచిపోయాయి. కారణి కాజ్‌వే ఉధృతంగా పారడంతో రెండు రోజులుగా 40 కుంటుబాలు వారు జలదిగ్బంధంలోనే ఉన్నారు. కోనేటిమిట్ట నుంచి చిన్నాయగుంట రోడ్డు వర్షానికి కోసుకుపోయింది.

కేవీబీపురం: వర్షం తగ్గినా మండలంలో వాగులు, వంకలు, చెరువు కలుజులు, కాళంగి యేరు పొంగి పొర్లుతున్నాయి. కళత్తూరు పెద్ద రిజర్వాయరు నిండి కలుజు పారుతోంది. అలాగే పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన కొట్టుకుపోయింది. దీంతో గత మూడు రోజులుగా పాడి రైతులు పాలను పంపించే మార్గం లేక నష్టం వాటిల్లుతోందని ఆవేదన చెందుతున్నారు. కాగా కొట్టాలమిట్ట గిరిజన కాలనీ రోడ్డు కొట్టుకుపోవడంతో ఇబ్బంది పడతున్నట్టు స్థానికులు వాపోయారు. అధికారులు స్పందించి కాలనీకి కనీసం కర్రల వంతెన అయినా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరు, మరదవాడ, సంతవేలూరు గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. సంతవేలూరు చెరువు, పులిబొంద, మార్లమడుగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ రెండు గ్రామాలు జలమయమయ్యాయి. వరి కూడా నీట మునిగే ఉంది. విద్యుత్ సరఫరా ఆగిపోయింది. రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఏర్పేడు: భారీ వర్షాలకు మండలంలోని మునలిపేడులో 16మంది రైతులకు సంబంధించి 36ఎకరాల్లో వరి, వేరుశనగ పంటకు నష్టం వాటిల్లింది. భారీ వర్షానికి నీరు ఉధృతంగా ప్రవహించడంతో వరినాట్లు నీట మునిగి ఇసుక మేట తేలింది. మూడు రోజుల క్రితం వేసిన వేరుశనగ పప్పు కుళ్లిపోయింది. వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. గోవిందవరం- మునగలపాళెం మధ్య స్వర్ణముకి నదిపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వే నీట మునిగింది. దీంతో మూలకండ్రిగ, చెల్లూరు, గుండ్లకండ్రిగ, ఎండీపుత్తూరు, సదాశివపురం, రాజులకండ్రిగ, మడిబాకలకు రాకపోకలు నిలిచిపోయాయి. గుడిమల్లం వద్ద సీతకాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

వరదయ్యపాళెం: మండలంలో శుక్రవారం సూళ్ళూరుపేట ఆర్డీవో కిరణ్మయి పర్యటించారు. వరద ప్రభావితప్రాంతాలను సందర్శించారు. గోవర్ధనపురం వద్ద ఉన్న వంతెనను పరిశీలించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని ఆయకట్టు ఎన్నికలపై తహసీల్దారు రాజశేఖర్‌కు పలు సూచనలుచేశారు. ప్రశాంత వాతావరణంలోనిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.




అమ్మపాళెంలో ఇళ్ల చుట్టూ చేరిన నీరు- మునలిపేడులో నీట మునిగిన వరినాట్లు - మోదుగులపాళెం వద్ద ఉధృతంగా స్వర్ణముఖి

టీడీపీ నాయకురాలికి పరామర్శ

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ మహిళా నాయకురాలిని శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్ సతీమణి పరామర్శించారు. ఇటీవల రేణుకాదేవి ప్రమాదానికి గురై స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆమెను రిషితారెడ్డి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసు కున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మారేడు కాలువపై అక్రమ ప్రహరీ నిర్మాణాలు

వరదయ్యపాళెం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురం సమీపంలో ఉన్న మారేడు కాలువ బఫర్ జోన్ ఆక్రమణకు గురికావడంతో పాటు అనధికార లేఅవుట్‌కు ప్రహరీ నిర్మించారు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ప్రాంతంలోని బీజీఆర్ కాలనీ, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పలుమార్లు ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నేడు నీటి సంఘాల ఎన్నికలు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో 13 సాగునీటి సంఘాలకు ఈనెల 14న శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు సత్యవేడు ఇరిగేషన్ డీఈ రత్నాకర్ రెడ్డి తెలిపారు. కుక్కంబాకం చిన్న చెరువు, పెద్ద చెరువు, పల్లమాల, పార్లపల్లి, కొత్తపాళెం, జంబుగోళం, కంచనపుత్తూరు, కరకంబట్టు, కారణిమిట్ట, కల్లివెట్టు, నెలవాయి, స్వర్ణముఖి, కాళంగి రిజర్వాయర్లకు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎన్నికలను మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తారని తెలిపారు.

వసతి గృహాల పరిశీలన

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలను బీజేపీ పట్టణ అధ్యక్షుడు జిరమేష్‌బాబు ఆధ్వర్యంలో గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులకు అందుతున్న భోజన వసతిపై ఆరా తీశారు. వసతిగృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయని గుర్తించారు. శైలజ, ప్రజ్ఞశ్రీ, వెంకటేశ్వర్లు, అమర్‌నాథ్, డిల్లీకుమార్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

రేణిగుంట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీపాళెం పంచాయతీ కుర్ర కాలువకు చెందిన వృద్ధురాలి అదృశ్యంపై గాజులమండ్యం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. రెహమాద్‌బీ(68) భర్త చని పోవడంతో ఒంటిరిగా నివసిస్తోంది. ఆమె కనిపించక పోవడంతో ఫిర్యాదు చేశారు. గాలిస్తునట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

నిండిన అరణియార్ ప్రాజెక్టు

- 31 అడుగులు, 1.85 టీఎంసీలతో జలకళ
- ఇన్‌ఫ్లో 5200, అవుట్ ఫ్లో 5600 క్యూసెక్కులు

పిచ్చాటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అరణియార్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 31 అడుగులు, సామర్థ్యం 1.85 టీఎంసీలకు చేరుకుంది. అదే సమయంలో సాయంత్రం 4.30 గంటలకు జలాశయానికి ఎగువన అరుణానది నుంచి 5400 క్యూ సెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై 5600 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువలకు పంపుతున్నారు. దీంతో పిచ్చాటూరు - శ్రీకాళహస్తి కాజ్‌వేపై నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పిచ్చాటూరు - శ్రీకాళహస్తి మధ్య రాకపోకలు స్తంభించాయి. పోలీసులు అప్రమత్తమై కాజ్‌వేకు ఇరువైపులా పహారా కాస్తున్నారు. రాత్రికి గేట్ల ద్వారా మరింత నీరు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. అరుణానది పరీవాహక గ్రామాల్లో రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులను కాపలా పెట్టారు. అరణియార్ జలాశయం వరుసుగా 6 సార్లు పూర్తి స్థాయిలో నిండడం పట్ల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ఆయా పంచాయతీల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు మధుసూదన్‌రావు కోరారు. తొట్టంబేడు మండలంలోని గొట్టిపూడిలో జరిగిన రెవెన్యూ సదస్సులో పలు భూసమస్యలు, ఇంటి స్థలాలపై వినతిపత్రాలు అందజేశారు. వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నం రాంబట్లపల్లిలో జరిగింది.

కేవీబీపురం: మండలంలోని ఎగువపుత్తూరు, కోటమంగా పురంలలో రైతు సదస్సులు నిర్వహించారు. ఇందుకు సంబంధించి సుమారు 50 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దారు మునిరత్నంరెడ్డి జనసేన నాయకుడు థామస్, టీడీపీ నాయకుడు నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పార్లపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో 33 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. అర్జీలకు 45 రోజుల్లో పరిష్కారం చూపిస్తామన్నారు. ఆర్ఐ నల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, దాము హరి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం పెద్దచెరువు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో స్థానికులు వినతిపత్రాలు అందించారు. ఈ గ్రామ చెరువును ఆక్రమించి కొంతమంది మామిడితోటకు రోడ్డు వేసుకున్నారని పేర్కొన్నారు. అలాగే అనుగుంట గ్రామంలో కూడా రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ రెండు గ్రామాల్లో జరిగిన సదస్సులో చెరువు ఆక్రమణలతోపాటు మరో నాలుగు వినతిపత్రాలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు, ఆర్ఐలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరిలో జరిగిన రెవెన్యూ సదస్సులో 26 వినతులు అందినట్టు టీడీపీ నాయకులు గురవారెడ్డి, పొన్నారావు, కృష్ణవేణి, గురవయ్య, సుబ్రహ్మణ్యం, మునెయ్య, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ఆదుకోండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో అవస్థలు పడుతున్న లోతట్టు ప్రాంత పేదలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. తొట్టంబేడు మండలం ఈదులగుంటలో శుక్రవారం సీపీఎం నాయకులు పర్యటించారు. సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, అంగేరిపుల్లయ్య, పెనగడం గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏవోగా గౌరి

వరదయ్యపాళెం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం వ్యవసాయశాఖ ఏవోగా శుక్రవారం గౌరి బాధ్యతలు స్వీకరించారు. ఈమె అనంతపురంలో సాయిల్ టెస్టింగ్ లేబోరేటరీలో విధులు నిర్వహిస్తుండగా బదిలీపై వరదయ్యపాళెంకు ఏవోగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏవో సత్యవేడుకు బదిలీ అయ్యారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువై ఉన్న కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఊంజల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చాటూరు - శ్రీకాళహస్తి రోడ్డుకు మోక్షం



పిచ్చాటూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు - శ్రీకాళహస్తి రోడ్డు పిచ్చాటూరు నుంచి అరణియార్ గేట్ల వరకు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. ఈ సమస్యను ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి ఎమ్మెల్యే ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే స్థానిక పారిశ్రామికవేత్త మునిశేఖర నాయుడిని సంప్రదించారు. ఆయన జల్లి తోలి బాగు చేయిస్తున్నారు.

గిరిజనులకు భోజన సదుపాయం

వరదయ్యపాళెం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురిసిన వర్షాలకు నిరాశ్రయులైన కంచరపాళెం గిరిజన కుటుంబాలకు డీపీ చాక్లెట్ పరిశ్రమ నిర్వాహకులు భోజన వసతి కల్పించారు. సుమారు 50కుటుంబాలకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో మధుస్వామి, మాజీ సర్పంచ్, టీడీపీ నాయకులు దశరథన్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలోకూడా అనిల్‌పురం గిరిజనకాలనీ వాసులకు అన్నదానం నిర్వహించారు.

వర్ష బాధిత ప్రాంతాల్లో పర్యటన

ఏర్పేడు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాగాలి పంచాయతీ కుమ్మరిగుంటలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత పర్యటించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు.